# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

RNI-APTEL/2012/46499

GST No:-37ACDFM5465G1Z1



సంపుటి : 14 సంచిక : 352 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ ఎడిటర్ : మహేష్ యాదవ్ 11-12-2025 పేజీలు : 12 వెల రూ.3/




## గ్లోబల్ సమ్మిట్‌తో ఊహించని విధంగా పెట్టుబడులు

- పేరెన్నికగన్న కంపెనీలతో పలు ఒప్పందాలు
- ముందస్తు కార్యక్రమాలతోనే రాహుల్, ఖర్గేలు రాలేదు
- త్వరలోనే పార్టీ పదవుల భర్తీని పూర్తి చేస్తాం
- మీడియా సమావేశంలో పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్,డిసెంబర్10

గ్లోబల్ సమ్మిట్‌తో ఊహించని స్థాయిలో తెలంగాణకు పెట్టుబడులు వచ్చాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చెప్పుకొచ్చారు. పేరుగాంచిన కంపెనీలతోనే తమ ప్రభుత్వానికి ఒప్పందాలు జరిగాయని వివరించారు. ముందు కొన్ని కార్యక్రమాలు ఫిక్స్ కావడంతో ఏఐసీసీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే ,రాహుల్ గాంధీ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు రాలేకపోయారని ➤ మిగతా 2వ పేజిలో..

## గత ఏడాదితో పోలిస్తే 32 శాతం

# పెరిగిన ధాన్యం సేకరణ

### ధాన్యం కొనుగోళ్లపై సీఎం చంద్రబాబు సమీక్ష... సేకరణ పెరగడంపై సంతృప్తి

- ఇప్పటివరకూ 18.32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతులకు రూ.4085 కోట్ల చెల్లింపులు
- ఈ ఏడాది 50.75 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యంగా నిర్ణయం

అమరావతి

రాష్ట్రంలో 2025-26 సంవత్సరానికి సంబంధించిన ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ధాన్యం కొనుగోళ్లు 32 శాతం పెరిగాయని, రాష్ట్రవ్యాప్తంగా 23 జిల్లాల్లో ఇప్పటివరకు 18.32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు అధికారులు ఈ సమావేశంలో ముఖ్యమంత్రికి



మిగతా 2లో

## సిఎం సహాయనిధి పంపిణీలో కొత్త రికార్డు

### రెండేళ్లలో రూ.1,685.79 కోట్ల సహాయం అందజేత

హైదరాబాద్,డిసెంబర్10

తెలంగాణలో ముఖ్యమంత్రి సహాయ నిధి పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త రికార్డు సృష్టించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గత రెండేళ్లలో పేద, మధ్యతరగతి ప్రజలకు ఎప్పుడూ లేని స్థాయిలో వైద్య సహాయం అందింది. 2023 డిసెంబర్ 7 నుంచి 2025 డిసెంబర్ 6 వరకు మొత్తం 3,76,373 మంది లబ్దిదారులకు రూ.1,685.79 కోట్ల సహాయం అందజేశారు. గతంలో 2014 నుంచి 2024 వరకు సంవత్సరానికి సగటున రూ.450 కోట్లు మాత్రమే సహాయ నిధి ద్వారా పంపిణీ కాగా, ప్రస్తుత ప్రభుత్వం రెండు సంవత్సరాల్లో సగటున సంవత్సరానికి రూ.850 కోట్ల మేర నిధులు వెచ్చించడం గమనార్హం.ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రజలకు రెండు విధాలుగా వైద్య సహాయం అందుతోంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స కోసం ముందుగానే ➤ మిగతా 2వ పేజిలో..



## ఆర్టీసికి 65 కొత్త ఎలక్ట్రిక్ బస్సులు

- కాలుష్య నివారణ లక్ష్యంగా కృషి
- బస్సులను ప్రారంభించిన మంత్రి పొన్నం

హైదరాబాద్,డిసెంబర్10 తెలంగాణ రాష్ట్రంలో ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్యను గణనీయంగా ➤ మిగతా 2వ పేజిలో..

# ఉస్మానియా వర్సిటీకి మహర్దశ

- వెయ్యికోట్లు విడుదలకు సిఎం రేవంత్ అంగీకారం
- వెంటనే విడుదలకు విద్యాశాఖ ఉత్తర్వులు
- అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధికి కంకణం
- తెలంగాణ ఉద్యమంలో ఉస్మానియాదే కీలకం
- ధైర్యంతో కాదు...గుండెనిండా ప్రేమతో ఇక్కడికి వచ్చా
- చదువు రాకున్నా..చదువు విలువ తెలిసినోడిని
- ఉస్మానియా సభలో సిఎం రేవంత్ భావోద్వేగ ప్రసంగం



హైదరాబాద్,డిసెంబర్10

ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దాలనే సంకల్పంతో వచ్చానని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణ తొలి,మలి దశ ఉద్యమాలకు ఉస్మానియానే కేంద్రమని అన్నారు. ఎన్నో ఉద్యమాలకు ఇది వేదికగా నిలిచిందన్నారు. ఆధిపత్యానికి వ్యతిరేకంగా తెలంగాణలో అనేక పోరాటాలు వచ్చాయి. నిజాం, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం జరిగింది. సామాన్యులైన చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య.. దొరలపై పోరాడారు. ఉమ్మడి రాష్ట్రంలో న్యాయం జరగలేదని తెలంగాణ ఉద్యమం వచ్చింది. ఉద్యమాన్ని ఉస్మానియా నుంచే విద్యార్థులు ప్రారంభించారు. గతంలో ఈ వేదిక నుంచే స్వరాష్ట్ర ఆకాంక్షను విద్యార్థులు బలంగా వినిపించారు. పోరాడి సాధించిన రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరాయా.. లేదా.. అని ఇక్కడే తెలుసుకోవాలని అనుకున్నానని అన్నారు. బుధవారం ఉస్మానియా వర్సిటీని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం ➤ మిగతా 2వ పేజిలో..

# అమరావతిలో మరో కదలిక..

- రెండో విడత ల్యాండ్ పూలింగ్‌కు వడ్డమాను రైతుల గ్రీన్ సిగ్నల్
- అమరావతిలో రెండో విడత ల్యాండ్ పూలింగ్‌కు కదలిక
- వడ్డమాను గ్రామంలో భూములిచ్చేందుకు రైతుల అంగీకారం
- మంత్రికి పాసుపుస్తకాల అందజేత

అమరావతి

రాజధాని అమరావతి నిర్మాణ పనుల్లో కీలక ముందడుగు పడింది. రెండో విడత ల్యాండ్ పూలింగ్‌కు తుళ్లూరు మండలం వడ్డమాను గ్రామ రైతులు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపారు. అయితే, కౌలు ప్యాకేజీని పెంచాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్‌తో కలిసి ఈరోజు వడ్డమాను గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో

మిగతా 2లో



## నా శాఖలో 10 వేల ప్రమోషన్లు ఇచ్చాం: పవన్ కల్యాణ్



వివరాలు 2 లో..

## ఎన్డీఏ ఎంపిలకు నేడు మోడీ విందు

### ఉభయ సభల్లో వ్యూహంపై చర్చించే అవకాశం

న్యూఢిల్లీ,డిసెంబర్10 ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎన్డీయే భాగస్వామ్య పార్టీల ఎంపీలకు తన నివాసంలో ప్రత్యేక విందు ఇవ్వనున్నారు. గురువారం సాయంత్రం 6.30 గంటలకు ఈ విందు సమావేశం ఏర్పాటు చేశారు. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నందున ఉభయసభల్లో పరస్పర సహకారం, భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయాన్ని పటిష్టం చేయడంలో భాగంగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు తెలుస్తోంది.

## గత ఏడాదితో పోలిస్తే 32 శాతం పెరిగిన ధాన్యం సేకరణ

మొదటిపేజీ తరువాయి

వివరించారు.రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2,606 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ ప్రక్రియ చురుగ్గా సాగుతోందని అధికారులు తెలిపారు. రైతుల సౌకర్యార్థం ఈ కేంద్రాల్లో 7.89 కోట్ల గోనె సంచులను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోపే రైతులకు రూ.4,085 కోట్లు చెల్లించినట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు వెల్లడించారు. వేగంగా చెల్లింపులు జరపడంపై సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ ఏడాది మొత్తం 50.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తో పాటు వ్యవసాయ, పౌరసరఫరాలు, ఆర్థిక శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## గ్లోబల్ సమ్మిట్‌తో ఊహించని విధంగా పెట్టుబడులు

➢ మొదటి పేజి తరువాయి

తెలిపారు. బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో మహేశ్ కుమార్ గౌడ్ చిట్‌చాట్ చేశారు.తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై శ్వేతపత్రం విడుదల చేసే దమ్ము తమకు మాత్రమే ఉందని పేర్కొన్నారు. శ్వేతపత్రం అంటే బీఆర్ఎస్‌కు భయమని ఎద్దేవా చేశారు మహేశ్ కుమార్ గౌడ్. ఫ్యూచర్ సిటీ భవిష్యత్‌లో గొప్పగా ఉంటుందని తెలిపారు. త్వరలో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టులు భర్తీ చేస్తామని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. టీపీసీసీ నియామకం జరిగిన రోజే డీసీసీలతో మినహా అన్ని పోస్టులు రద్దు అవుతాయని తెలిపారు. ఈనెల చివరి నాటికి కార్పొరేషన్ చైర్మన్‌లు, డైరెక్టర్ పోస్టులు భర్తీ చేస్తామని చెప్పుకొచ్చారు. లంబాడాలకు నాలుగు జిల్లాలకు అధ్యక్షులను నియమించామని తెలిపారు. ఎస్టీలకు కాంగ్రెస్ పార్టీలో తగిన ప్రాధాన్యం ఉంటుందని వివరించారు. గ్లోబల్ సమ్మిట్ సక్సెస్ చూడలేక మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. లావాదేవీలలో భాగంగానే కవిత - బీఆర్ఎస్ నేతల మధ్య విమర్శలు చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కవిత కారణంగా బీఆర్ఎస్ కబ్జాలు అన్ని బయటకు వస్తున్నాయని విమర్శించారు. కవిత ఆరోపణలపై విచారణ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. తాను టీపీసీసీగా చాలా సంతృప్తిగా ఉన్నానని స్పష్టం చేశారు. ఆర్గనైజేషన్ అంటే తనకు ఇష్టమని చెప్పుకొచ్చారు. మీడియాలోనే తనకు డిప్యూటీ సీఎం పదవి ఇస్తున్నారని చెబుతున్నారని.. అప్పుడే మంత్రి పదవి ఇస్తున్నారంటూ కూడా ఊహాగానాలు వస్తున్నాయని తెలిపారు. లోక్‌సభలో ప్రియాంక గాంధీ చాలా బాగా మాట్లాడారని ప్రశంసించారు మహేశ్ కుమార్ గౌడ్. పశ్చిమ బెంగాల్ ఎలక్షన్ కోసం వందేమాతరాన్ని బీజేపీ తెరపైకి తెచ్చిందని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జవాహర్ లాల్ నెహ్రూను విమర్శిస్తూ జీవితంలో అతిపెద్ద పొరపాటు చేశారని మండిపడ్డారు. నెహ్రూ వల్లే దేశం వెనకబడిందని బీజేపీ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉస్మానియా విశ్వవిద్యాలయానికి వెళ్లాలంటే బయపడ్డారని ఎద్దేవా చేశారు. 1965లో ఇందిరాగాంధీ ఆర్ట్స్ కాలేజీకి వచ్చారని... 60 సంవత్సరాల తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి ఆర్ట్స్ కాలేజీకి వెళ్లడం చరిత్రగా నిలిచిందని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## సిఎం సహాయనిధి పంపిణీలో కొత్త రికార్డు

➢ మొదటి పేజి తరువాయి

ఖర్చు భరించే లెటర్ ఆఫ్ క్రెడిట్ విధానం ద్వారా 27,421 మంది లబ్దిదారులకు రూ.533.69 కోట్ల సహాయం అందింది. నిమ్స్, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి, ప్రభుత్వ ఈఎన్‌టీ ఆసుపత్రి వంటి వైద్య కేంద్రాల్లో ఈ సహాయం నేరుగా చికిత్స ఖర్చులకు ఉపయోగపడింది. మరోవైపు ప్రైవేటు లేదా కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారు ఖర్చులు చెల్లించిన అనంతరం తిరిగి పొందే రీయింబర్స్‌మెంట్ విధానం ద్వారా 3,48,952 మందికి రూ.1,152.10 కోట్లు అందజేశారు. ప్రజలు ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన వైద్యం పొందేలా ప్రభుత్వ ఆసుపత్రులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. ముఖ్యంగా నిమ్స్‌లో ఎక్కువగా లెటర్ ఆఫ్ క్రెడిట్ కేసులు మంజూరవడం ద్వారా పేదలకు అత్యాధునిక చికిత్స అందుబాటులోకి వచ్చింది. ఈ మొత్తం ప్రక్రియలో దళారీల పాత్ర లేకుండా దరఖాస్తులను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో స్వీకరిస్తున్నారు. ఆధార్ ధృవీకరణ తర్వాత లబ్దిదారుడి పేరు, బ్యాంక్ ఖాతా వివరాలతో చెక్కులు జారీ చేస్తుండటంతో పారదర్శకత మరింత పెరిగింది.

తెలంగాణ రాష్ట్ర నివాసితులు, సాధారణంగా సంవత్సరానికి రూ.1.60 లక్షల లోపు కుటుంబ ఆదాయం ఉన్నవారు ముఖ్యమంత్రి సహాయ నిధికి అర్హులు. ప్రజాప్రతినిధుల సిఫారసుతో అధికారిక అఫీషియల్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఆరోగ్యశ్రీ పథకానికి అదనంగా పనిచేస్తున్న ఈ సహాయ నిధి, అనారోగ్యం కారణంగా ఆర్థికంగా కుంగిపోయే కుటుంబాలకు పెద్ద భరోసాగా మారింది. గతంతో పోలిస్తే నాలుగింతల స్థాయిలో నిధులు వెచ్చించడం ద్వారా ప్రజల ఆరోగ్యం ప్రభుత్వం కోసం ఎంత కీలకమో ఈ గణాంకాలే స్పష్టంగా చూపిస్తున్నాయి.

## నా శాఖలో 10 వేల ప్రమోషన్లు ఇచ్చాం:

గత ప్రభుత్వ హయాంలో బదిలీలు, పదోన్నతులకు రేట్ కార్డ్ పెట్టి వ్యాపారం చేశారని, తమ ప్రభుత్వంలో మాత్రం పారదర్శకంగా అర్హతకే ప్రాధాన్యత ఇచ్చామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఉద్యోగులతో నిర్వహించిన 'మాటామంతీ' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన శాఖలో పెండింగ్‌లో ఉన్న 10 వేల పదోన్నతులను పూర్తి చేశామని ఆయన వెల్లడించారు.పల్లెలే దేశానికి వెన్నెముక అనే నమ్మకంతోనే పంచాయతీరాజ్ శాఖను తాను తీసుకున్నానని పవన్ తెలిపారు. తన తండ్రి కూడా ప్రభుత్వ ఉద్యోగేనని, ప్రమోషన్ కోసం ఒక కుటుంబం ఎలా ఎదురుచూస్తుందో తనకు తెలుసని గుర్తుచేసుకున్నారు. అందుకే బాధ్యతలు చేపట్టగానే పదోన్నతులపై దృష్టి సారించానన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు సిఫార్సు చేసినా అర్హత, అనుభవం, పనితీరు ఆధారంగానే ప్రమోషన్లు ఇచ్చామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కొందరు ఉద్యోగులు తమ సమస్యలను పవన్ దృష్టికి తీసుకొచ్చారు. కొన్ని గ్రామాల్లో సర్పంచ్‌లు సకాలంలో సంతకాలు చేయకపోవడంతో జీతాలు, బిల్లులు ఆలస్యమవుతున్నాయని వాపోయారు. దీనిపై తీవ్రంగా స్పందించిన పవన్ కల్యాణ్, నిర్లక్ష్యంగా వ్యవహరించే సర్పంచ్‌ల జాబితా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగుల జీతాలు ఆలస్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఉద్యోగుల భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారిపై ఎవరు దాడులు చేసినా కఠినంగా వ్యవహరిస్తామని హామీ ఇచ్చారు. ఇదే క్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిని బయటకు తీస్తామన్నారు. పవిత్రమైన లడ్డూ ప్రసాదం, పరకామణి వ్యవహారాల్లో అవకతవకలకు పాల్పడిన వారిని చట్టంతో పాటు దేవుడు కూడా శిక్షిస్తాడని వ్యాఖ్యానించారు.

# అమరావతిలో మరో కదలిక..

మొదటిపేజీ తరువాయి

రైతులు తమ అంగీకారాన్ని తెలుపుతూ, గుర్తుగా ముగ్గురు రైతులు తమ పాసు పుస్తకాలను మంత్రికి అందజేశారు.
ఈ సమావేశంలో మంత్రి నారాయణ మాట్లాడుతూ, రాజధాని పరిధిలోని ఏడు గ్రామాల్లో ఇంకా 16,666 ఎకరాలకు పైగా భూమిని సమీకరించాల్సి ఉందని తెలిపారు. 2014-19 మధ్య కాలంలో రైతుల సలహాలు, సూచనలతోనే భూ సమీకరణ విధానాన్ని రూపొందించామని, ఇప్పుడు కూడా వారితో చర్చించి, వారి నిర్ణయాల ప్రకారమే ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో పెట్టిన కేసులు, ఇతర కారణాల వల్ల రాజధాని పనుల్లో జాప్యం జరిగిందని అన్నారు.
గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులు కల్పించాలని రైతులు కోరగా, వాటిని వెంటనే పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. రాజధానిలోని 29 గ్రామాలను అభివృద్ధి చేయడానికి రూ.900 కోట్లు అవసరమని, తొలి దశలో భాగంగా ఆరు నెలల్లో తొమ్మిది గ్రామాలను అభివృద్ధి చేయడానికి ఆదేశాలు జారీ చేశామని వివరించారు.

రైతులు కోరిన విధంగా వడ్డమాను గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి నారాయణ భరోసా ఇచ్చారు.

# ఉస్మానియా వర్సిటీకి మహర్దశ




➢ మొదటి పేజి తరువాయి

సందర్శించారు. ఈ సందర్భంగా ఓయూకు రూ.1000 కోట్ల నిధులను సీఎం విడుదల చేశారు. ఈ నిధులను విద్యార్థులకు అంకితం చేశారు. అలాగే, ఓయూ అభివృద్ధికి రూ.45 లక్షల చెక్కు పూర్వ విద్యార్థులు అందజేశారు. అనంతరం ఆర్ట్స్ కాలేజీ భవనం దగ్గర 'సర్వం సిద్ధం' పేరుతో నిర్వహించిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. స్వరాష్ట్ర ఆకాంక్షను బలంగా ఉస్మానియా యూనివర్సిటీ వినిపించిందని తెలిపారు. భవిష్యత్తు ప్రణాళికలపై చర్చించడానికి ఓయూకు వచ్చానని వివరించారు. గతంలో ముఖ్యమంత్రులను అడ్డుకున్న చరిత్ర ఉందని ప్రస్తావించారు. మీరు ఎందుకు ఓయూకు వెళ్లే ధైర్యం చేస్తున్నారని కొంతమంది తనతో అన్నారని గుర్తుచేశారు. మీరిచ్చే సూచనలు, మేధావులు ఇచ్చే సలహాలతో ఓయూను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు. విద్యార్థులకు తమ ప్రభుత్వం అండగా ఉండాలనే ఓ ఆలోచనతో ఇక్కడకు వచ్చానని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ధైర్యంతో కాదని.. విద్యార్థుల గుండెల నిండా ఉన్న అభిమానంతో ఆర్ట్స్ కాలేజీ వద్దకు వచ్చానని వ్యాఖ్యానించారు. తమ ప్రసంగాలు చదువుకొని కాదని.. తన మనసులో ఉన్నది చెప్పాలని ఇక్కడకు వచ్చానని చెప్పుకొచ్చారు. పురాతన యూనివర్సిటీలో ఉస్మానియా ఒకటని వివరించారు. ఉస్మానియా యూనివర్సిటీకి గొప్ప చరిత్ర ఉందని అభివర్ణించారు. ఇక్కడకు రావాలంటే ధైర్యం కాదని.. అభిమానం కావాలని చెప్పుకొచ్చారు. తెలంగాణలో చదువు లేకున్నా ఆధిపత్యాన్ని సహించరని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంతానికి ఒక చైతన్యం, పౌరుషం ఉంది. ఎందరో ఓయూ విద్యార్థులు రాష్ట్రం కోసం ఆయుధాలతో అడవిబాట పట్టారు. గద్దర్, జార్జిరెడ్డి, పీవీ నరసింహారావు వంటి ఎంతోమంది ప్రముఖులను ఈ యూనివర్సిటీ ఇచ్చింది. బడికి వెళ్లని ఓ పేదింటి బిడ్డ అందెశ్రీ.. జయజయహే తెలంగాణ నినాదాన్ని అందించారు. సమాజానికి ఏ సమస్య వచ్చినా ఈ యూనివర్సిటీ విద్యార్థులు కదం తొక్కారు. రాష్ట్రం ఏర్పడ్డాక ఎవరి ఆస్తిలో వాటా అడగలేదు.. కేవలం స్వేచ్ఛ, సమాన అవకాశాలు మాత్రమే అడిగారు. మీరు ఎదిగేందుకు ఈ ప్రభుత్వం స్వేచ్ఛను ఇస్తుంది. ప్రపంచానికే మీరు దిక్సూచిగా మారాలి. ఎవరి గురించీ రాజకీయ వ్యాఖ్యలు చేయాలనుకోవడం లేదు. కొందరు రెండేళ్లుగా మాట్లాడుతున్నారు. నేను గుంటూరులో చదువుకోలేదు.. గూడుపుఠాణీలు చేయలేను. గుంటూరులో చదువుకున్న వాళ్లు బెంజ్ కారులో వెళ్లి పేదరికం గురించి తెలుసుకుంటారు. గుంటూరు, పుణె, అమెరికాలో చదువుకున్నాం అని ఉపన్యాసాలు ఇవ్వడం ద్వారా ఏం చెప్పాలని అనుకుంటున్నారు? నాకు భాష సరిగా రాకపోవచ్చు.. కానీ పేదవాడిని అర్థం చేసుకునే భాష వచ్చు. పేదవాడి బిడ్డ చదువుకుంటే ఎలాంటి ప్రయోజనం ఉంటుందో నాకు తెలుసు. పేదలు, నిస్సహాయులకు అండగా ఉండేలా చర్యలు చేపడుతున్నాం. నేను ఫాంహౌస్‌లు కట్టించుకోలేదు.. సాధారణంగానే ఉన్నా. రాష్ట్ర ముఖ్యమంత్రిగా, మీ సోదరుడిగా ఈ ఆర్ట్స్ కాలేజీ ముందు నిలుచున్నా. చరిత్రలో సజీవంగా నిలబడే కార్యక్రమాలు చేయాలని అనుకుంటున్నా. జయజయహే తెలంగాణ గీతం, తెలంగాణ తల్లిని ఆవిష్కరించుకున్నాం. వర్గీకరణ ద్వారా దళితుల సమస్యను శాశ్వతంగా పరిష్కరించాం. జనగణనలో కులగణన చేపట్టి వందేళ్ల సమస్యను పరిష్కరించాం. ప్రభుత్వం దగ్గర పంచేందుకు డబ్బు లేదు. దళితులకు మూడెకరాల భూమి ఇస్తామన్నారు.. గత పదేళ్లలో ఎవరికైనా ఇచ్చారా? భూములు ఉన్న ఆసాములు కూడా వెనుకబాటుతనంతో బాధపడు తున్నారు. దాన్ని నిర్మూలించాలంటే ప్రతి గ్రామంలో విద్యావకాశాలు పెంచాలి. నాణ్యమైన విద్య, స్కిల్స్‌ను అందించేందుకు కృషి చేస్తున్నాం. విద్య ఒక్కటే మన ఆత్మగౌరవాన్ని పెంచుతుందన్నారు.

విద్యాలయాల్లో కుల వివక్ష ఉండకూడదనే యంగ్ ఇండియా స్కూల్స్‌లో అందరూ కలిసి చదువుకునేలా చర్యలు చేపట్టాం. డబ్బు ఉన్నవాళ్లు ఎక్కడికి వెళ్లి అయినా చదువుకోగలరు. పేదింటి విద్యార్థులకు ఉస్మానియా యూనివర్సిటీ నాణ్యమైన విద్యను అందించాలి. మంజూరు చేసిన రూ.1000 కోట్లు డబ్బుగా కాదు.. భవిష్యత్తు తరాలకు పెట్టుబడిగా చూస్తున్నాం. ఉత్తుత్తి మాటలు చెప్పను.. మన చేనుకి చీడ పడితే ఏ మందు కొట్టాలో నాకు తెలుసు. నాకు ఇంగ్లీష్ రాదని వాళ్లు అనుకుంటున్నారు. చైనాకు కూడా ఆ భాష రాదు.. కానీ ఆ దేశం ప్రొడక్షన్ నిలిపివేస్తే అమెరికా కూడా విలవిలలాడుతుంది. భాష కేవలం కమ్యూనికేషన్ కోసం మాత్రమే.. అది నాలెడ్జ్ కాదు. రాష్ట్రానికి ఓయూ గుండెకాయ లాంటిది. సమస్యల మీద కొట్లాడతానంటే నేను వద్దు అనను. రాజకీయ పార్టీల మోచేతినీళ్లు తాగాలని.. వాళ్ల జెండాలు మోయాలని అనుకోవద్దు. మీ స్వతంత్రతను నిలబెట్టుకోండని రేవంత్ అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీకి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. రూ.వెయ్యి కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రూ.వెయ్యికోట్ల నిధుల విడుదల జీవోను విద్యార్థులకు అంకితం చేస్తున్నట్లు సీఎం పేర్కొన్నారు.

# ఆర్టీసికి 65 కొత్త ఎలక్ట్రిక్ బస్సులు

➢ మొదటి పేజి తరువాయి

పెంచుతూ, ఆర్టీసీని కాలుష్య రహిత ప్రజా రవాణా వ్యవస్థగా మార్చడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. రాణిగంజ్ ఆర్టీసీ డిపోలో 65 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించిన సందర్భంగా మంత్రి ఈ వివరాలను వెల్లడించారు. ప్రస్తుతం తెలంగాణ ఆర్టీసీలో 810 ఎలక్ట్రిక్ బస్సులు పరుగులు పెడుతున్నాయి. ఇందులో జంట నగరాల పరిధిలో 300కు పైగా బస్సులు తిరుగుతున్నాయి.జనవరి చివరి నాటికి మరో 175 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి రానున్నాయి. అత్యాధునిక 'పీఎం ఈ-డ్రైవ్' పథకం కింద అతి త్వరలో ఏకంగా 2,800 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రక్రియ దశలవారీగా ఒకటి లేదా రెండు సంవత్సరాలలో పూర్తవుతుందని మంత్రి తెలిపారు. ఆర్టీసీ రవాణా వ్యవస్థను ఈవీ బస్సుల ద్వారా ముందుకు తీసుకువెళ్లి, హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఆర్టీసీ సేవలను విస్తరించడంలో భాగంగా త్వరలో 373 కొత్త ప్రాంతాలకు బస్ కనెక్టివిటీని అందిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇంటర్ సిటీ ట్రాన్స్‌పోర్టేషన్ కింద వరంగల్, ఖమ్మం, నల్గొండ వంటి చుట్టుపక్కల జిల్లాల నుండి హైదరాబాద్‌కు ఈవీ బస్సులను ప్రారంభం చేసినట్లు ఆయన వివరించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ బస్సుల విస్తరణ జరుగుతోందని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, మహాలక్ష్మి పథకం అమలు ద్వారా ఆర్టీసీ వ్యవస్థ లాభాల బాట పట్టిందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆర్టీసీ కార్మికులకు భరోసా ఇస్తూ, వారి సమస్యలన్నీ అతి త్వరలో పరిష్కారమవు తాయని హామీ ఇచ్చారు. ప్రజా పాలన ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మహాలక్ష్మి పథకం ప్రారంభించి రెండేళ్లు పూర్తి చేసుకున్నామన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ప్రారంభించినట్లు తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్, శ్రామిక్, ఇతర సిబ్బంది ఎంతో శ్రమిస్తున్నారని.. వారందరికీ అభినందనలు చెప్పారు. ఇప్పటికీ 251 కోట్ల మంది మహిళలు.. రూ.8,500 కోట్ల విలువైన ప్రయాణాలు చేశారన్నారు. హాస్పిటల్స్, దేవాలయాలు, ఉద్యోగులు, బంధువుల ఇంటికి, స్కూళ్లకు రాకపోకలు సాగించారన్నారు. దేవాదాయ శాఖ ఆదాయం మహాలక్ష్మి పథకం ద్వారా పెరిగిందన్నారు. రెండేళ్లలో ప్రస్తుతమున్న 40శాతం బస్సులను కొనుగోలు చేయడం జరిగిందని.. ఆర్టీసీలో కొత్త రక్తం వస్తుందన్నారు. కొత్తగా డ్రైవర్లు, కండక్టర్లు, శ్రామిక్స్ వస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆర్టీసీ బస్సులకు మహిళలను యజమానుల చేసిందన్నారు. ఢిల్లీ లో నివాస యోగ్యం లేకుండా కాలుష్యం ఉన్న పరిస్థితి ఉందని.. ఇక్కడ అలాంటి పరిస్థితి రాకుండా రవాణా శాఖ ఈవీ పాలసీ, స్క్రాప్ పాలసీ తీసుకొచ్చిందన్నారు. ఆర్టీసీ సంస్థ పరిరక్షణ, ఉద్యోగుల సంక్షేమం, ప్రయాణికుల భద్రత దృష్టిలో పెట్టుకుందన్నారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న అనేక అంశాలు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రయాణికులకు సౌకర్యంగా ఈవీ బస్సులు సమ్మక్క సారలమ్మ జాతర, శ్రీశైలం, యాదాద్రికి రాకపోకలు సాగిస్తాయన్నారు. ప్రత్యేక బస్సులు బస్సులు, నూతన బస్ డిపోల ఏర్పాటు, బస్ స్టేషన్లను అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు.

## ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయింపు ఇవ్వాలి

### ఆల్మేవా డిమాండ్



**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో**

ఆంధ్రప్రదేశ్‌లో 1994-2018 డిఎస్సి ల ద్వారా నియమితులైన సుమారు 1.20 లక్షల ఇన్‌సర్వీస్ టీచర్లు ప్రస్తుతం "టెట్" అర్హత లేకపోవడంతో ఆందోళనలో ఉన్నారని ఆల్ మైనారిటీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీ (ఆల్ మేవా ఏపీ) రాష్ట్ర అధ్యక్షుడు ఇంజనీర్ ఇమ్రాన్ పాష, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎస్ ఎండి అబులైస్ లు నేడు సలీం నగర్ లోని ఆల్ మేవా కార్యాలయంలో జరిగిన సమావేశంలో తెలిపారు. వారు మాట్లాడుతూ, గతంలో ఇచ్చిన మినహాయింపులను (జి.ఓ 27/2018, 31/2020) ప్రభుత్వం జి.ఓ 54 (12-11-2024) ద్వారా రద్దు చేయడం వలన టీచర్లకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. తాజాగా సుప్రీంకోర్టు తీర్పు (02-09-2025) మరియు అనేక రాష్ట్రాలు ఇప్పటికే ఇచ్చిన రాయితీల నేపథ్యంలో, ఇన్‌సర్వీస్ టీచర్లకు ఆర్టిఈ యాక్ట్ 23(2) ప్రకారం వెంటనే మినహాయింపు ఇవ్వాలని ఆయన అన్నారు. అలాగే ప్రధానమంత్రి కార్యాలయం (పి ఎం ఓ) రాష్ట్రాల నుండి టెట్ మినహాయింపు వివరాలు కోరిన తాజా ఇమెయిల్‌ను దృష్టిలో ఉంచుకొని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తక్షణం అనుకూల నివేదిక పంపాలని, లేదంటే మన రాష్ట్ర టీచర్లు వెనుకబడిపోయే ప్రమాదం ఉందని ఆల్ మేవా, ఏపీ హెచ్చరించింది. వారు ప్రభుత్వానికి క్రింది డిమాండ్లు చేశారు: 1.జీవో. 54 తక్షణ ఉపసంహరణ 2.ఇన్‌సర్వీస్ టీచర్లకు శాశ్వత టెట్ మినహాయింపు 3.పి ఎం ఓ కి తక్షణంగా అనుకూల నివేదిక సమర్పణ. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ బాడీ మెంబర్లు నబి రసూల్, అమీరుద్దీన్, మీర్జా మాలిక్ బేగ్, సయ్యద్ మునీర్ అహ్మద్ లు పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో ఉండి, మెరుగైన సేవలు అందించాలి

### సచివాలయ సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలి

### జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్



**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో**

ప్రజలకు అందుబాటులో ఉండి, మెరుగైన సేవలు అందించాలని, సచివాలయ సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ ఆదేశించారు. బుధవారం కల్లూరు మండలం నన్నూరు గ్రామ సచివాలయాన్ని, సక్షం అంగన్వాడీ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సచివాలయంలో ర మూమెంట్ రిజిస్టర్, హాజరు పట్టిక తదితర కార్యాలయ సంబంధిత రికార్డులను సమగ్రంగా పరిశీలించారు. సిబ్బంది హాజరు, సేవల అందుబాటు, ప్రజలకు అందిస్తున్న సేవల స్థాయి గురించి సిబ్బందితో ఆరా తీశారు. సచివాలయ సిబ్బంది సకాలంలో విధులకు హాజరవ్వాలని జేసీ ఆదేశించారు. ప్రజలను సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా పనిచేయాలని స్పష్టం చేశారు. సేవలకు సంబంధించి పెండింగ్ లేకుండా ప్రాధాన్యతతో క్లియర్ చేయాలని సూచించారు.ఆ తరువాత గ్రామంలోని సక్షం అంగన్వాడి కేంద్రాన్ని కూడా ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్వాడిలో నిర్వహణ, పిల్లలకు అందుతున్న ఆహారం, పోషణ ప్రణాళికల అమలుపై సమగ్రంగా పరిశీలించారు. పోషణ యాప్‌లో నమోదు చేసిన వివరాలు, రికార్డులు, హాజరు సమాచారం, పంపిణీ ప్రక్రియను కూడా పరిశీలించారు. పిల్లలకు సరైన పోషకాహారాన్ని తప్పనిసరిగా అందించాలని, అంగన్వాడి పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, గర్భిణీ స్త్రీలకు టేక్ హోమ్ రేషన్‌ను సక్రమంగా, ఏ లోపాలు లేకుండా అందించాలని జాయింట్ కలెక్టర్ సిబ్బందిని ఆదేశించారు.

## ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

### డార్మెటరీ, టాయిలెట్ లలో శుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలి

### షాపుల్లో గడువు ముగిసిన వస్తువులు, ఎమ్మార్పీ ధర కు మించి వస్తువులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం

### ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి





**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో**

ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఆర్టీసీ అధికారులను ఆదేశించారు..

బుధవారం జిల్లా కలెక్టర్ కర్నూలు ఆర్టీసీ బస్ స్టాండ్ ను ఆకస్మిక తనిఖీ చేశారు..ఈ సందరరేగా బస్టాండ్ లోని రిజర్వేషన్ కౌంటర్, టాయిలెట్స్, డార్మిటరీ, ఉచిత త్రాగు నీరు, షాపులు, హోటల్ లు, నిఘా, భద్రత విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. బస్ స్టాండ్ ఎంట్రన్స్ ప్రాంగణంలో పై కప్పు పెచ్చులు ఊడిపోవడాన్ని గమనించి, ప్రమాదాలు జరుగక ముందే త్వరితగతిన మరమ్మ తులు చేపట్టి బాగు చేయిం చాలని కలెక్టర్ ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎంను ఆదేశించారు.టాయిలెట్ లను పరిశీలిస్తూ మెయింటెనెన్స్ బాగుందని, అయినప్పటికీ మరింత మెరుగుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. అదే విధంగా టాయిలెట్ ఎంట్రన్స్ వద్ద డోర్ ఏర్పాటు చేయడంతో పాటు పెయింటింగ్ వేయించాలని కలెక్టర్ సంబంధిత కాంట్రాక్టర్ ను ఆదేశించారు. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర డార్మిటరీ నిర్వహణ సరిగా లేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు..డార్మిటరీ శుభ్రంగా లేదని, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా శుభ్రత పాటించాలని, ప్రయాణీకులతో గౌరవంగా మాట్లాడాలని కలెక్టర్ డార్మిటరీ సిబ్బందిని ఆదేశించారు..అనంతరం బస్ కండక్టర్ల కు సంబంధించిన ఎర్నింగ్ సెక్షన్ రికార్డు రూమ్ ను కలెక్టర్ పరిశీలించారు.బస్ స్టాండ్‌లో ఏర్పాటు చేసిన త్రాగునీటి కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలిస్తూ, నీటిని తాగి చూశారు.. త్రాగునీటి కేంద్రం వెనుకభాగం నుండి చెడు వాసన వస్తోందని గమనించిన కలెక్టర్, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎంను ఆదేశించారు.బస్ స్టాండ్ పరిసరాల్లో ఉన్న షాపులు, హోటళ్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందరరేగా షాపుల్లో అమ్ముతున్న వాటర్ బాటిల్స్, బిస్కెట్ ప్యాకెట్లు వంటి ప్యాకేజ్డ్ ఫుడ్ ఐటమ్స్‌పై గడువు తేదీలు ఉన్నాయో లేదో కలెక్టర్ తనిఖీ చేశారు. గడువు ముగిసిన వస్తువులను అమ్మడం, అలాగే ఎంఆర్పీ ధర కంటే ఎక్కువకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ షాపు యజమానులను గట్టిగా హెచ్చరించారు. హోటల్‌ను పరిశీలించిన కలెక్టర్, అక్కడే అల్పాహారం చేస్తున్న ప్రయాణికులతో మాట్లాడారు. "అల్పాహారం ఎలా ఉంది? రుచిగా ఉందా లేదా?" అని అడిగి ప్రయాణికుల అభిప్రాయాలను తెలుసుకున్నారు.. హోటల్ నిర్వహణలో శుభ్రత ఖచ్చితంగా పాటించాలని, నాణ్యమైన నూనెను ఉపయోగించాలని, అలాగే అధిక ధరలకు అమ్మిన పక్షంలో కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యం, ప్రయాణికుల సౌకర్యం దృష్ట్యా ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని కలెక్టర్ తెలిపారు.ప్రజా రవాణా భద్రతను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో కలెక్టర్ బస్సు డిపోలోని నిఘా మరియు భద్రతా విభాగాలను ప్రత్యక్షంగా పరిశీలించారు.. డిపోలో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది డ్రైవర్లు మద్యం సేవించారా లేదా అనే దాని బ్రీత్ అనలైజర్ ద్వారా క్షుణ?ంగా చెక్ చేస్తున్న తీరును కలెక్టర్ పరిశీలించారు.. డిపో ప్రవేశద్వారం వద్ద మ్యాన్‌హోల్ తెరిచి ఉండడాన్ని గమనించిన కలెక్టర్, వెంటనే దాన్ని మూసివేయడంతో పాటు పరిసరాల్లోని డ్రైనేజ్‌ను తక్షణమే శుభ్రం చేయించాలని కలెక్టర్ ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం ను ఆదేశించారు. అనంతరం డీజిల్ నిల్వ సెంటర్‌ను సందర్శించిన కలెక్టర్, డీజిల్ యొక్క సాంద్రత (Density) మరియు ఉష్ణోగ్రత (Temperature) ను స్వయంగా పరిశీలించారు. ఇంధన నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని కలెక్టర్ అధికారులను ఆదేశించారు..

**స్త్రీ శక్తి పథకం ప్రయోజనాలపై ప్రయాణికుల ప్రశంసలు** స్త్రీ శక్తి పథకం అమలు ద్వారా ప్రజలకు ఏ విధంగా లాభం చేకూరుతుందో తెలుసుకునేందుకు కలెక్టర్ కర్నూలు - నంద్యాల సర్వీస్ బస్సులోకి ప్రవేశించి ప్రయాణికుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.. అదే విధంగా బస్సులో శుభ్రత, ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నారా వంటి అంశాలపై కలెక్టర్ ప్రయాణికులను ఆరా తీశారు.. స్త్రీ శక్తి పథకం ద్వారా మంచి లబ్ధి చేకూరుతోందని, బస్ స్టాండ్‌లో అందుబాటులో ఉన్న సౌకర్యాలు సంతృప్తికరంగా ఉన్నాయని ప్రయాణికులు కలెక్టర్‌కు వివరించారు. జిల్లా కలెక్టర్ వెంట ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు, డిపో మేనేజర్ లు , ఏపీఎస్ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

## విభిన్న ప్రతిభావంతులకు అన్ని విధాలుగా అండగా ఉంటాం

### సమస్యల పరిష్కారం కోసం ప్రతి మూడు నెలలకు ప్రత్యేక గ్రీవెన్స్ సెల్

### విభిన్న ప్రతిభావంతులు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణించాలి

### జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా

**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో**




విభిన్న ప్రతిభావంతులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా రాణించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో 66వ అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందరరేగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఛైర్మన్ గడుపూటి నారాయణ స్వామి, ఉమ్మడి జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ అధికారి రయిజ్ ఫాతిమా, డిఆర్డిఎ పీడీ శ్రీధర్ రెడ్డి, సెట్కూరు సీఈఓ వేణుగోపాల్, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి కళ్యాణి, జిల్లా నైపుణ్య అధికారి శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందరరేగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ సాధారణ ప్రజానీకం - విభిన్న ప్రతిభావంతులు అనే తారతమ్యం లేకుండా సమాజంలో ప్రతి ఒక్కరు సమాన అవకాశాలతో ఎదగాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదన్నారు. డిసెంబరు 3న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విభిన్న ప్రతిభావంతుల శ్రేయస్సు కోసం 'ఇంద్రధనస్సు' పథకాన్ని ప్రారంభించారని గుర్తుచేశారు. విభిన్న ప్రతిభావంతులలో అపారమైన ప్రతిభ ఉందని, దాన్ని సరైన దారిలో వినియోగించుకుంటే జీవితంలో మరింత ఎత్తులకు చేరుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. విద్యాపరమైనా, క్రీడాపరమైనా వారికి ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తున్న ఫలితంగా అంధుల క్రికెట్ టోర్నమెంట్లలో రాష్ట్రానికి చెందిన క్రీడాకారులు అదుతే ప్రదర్శనలు ఇస్తున్నారని తెలిపారు. ఈ స్థాయికి తీసుకొచ్చేందుకు పాత్ర వహించిన తల్లిదండ్రులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

విభిన్న ప్రతిభావంతుల బ్యాక్‌లాగ్ భర్తీ, రెగ్యులర్ నియామకాల్లో వారికి ప్రాధాన్యం కల్పించాలన్న విజ్ఞప్తిపై పరిశీలన జరుగుతుందని చెప్పారు. భవిత కేంద్రాలకు వచ్చే చిన్నారుల తల్లిదండ్రులకు నైపుణ్య శిక్షణలు అందించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడతామన్నారు. ప్రైవేట్ కంపనీలు నిర్వహించే జాబ్ మేళాల్లో విభిన్న ప్రతిభావంతులు చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఉద్యోగుల్లో బదిలీల విషయంలో పారదర్శకత పాటిస్తామని, సర్టిఫికెట్ పునఃమూల్యాంకన కోసం ప్రభుత్వ వైద్యశాలకు తరచూ రావాల్సి వస్తున్న సమస్యను దృష్టిలో ఉంచుకొని గ్రౌండ్ ఫ్లోర్‌లోనే కంప్లైంట్ బాక్స్ ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు.

విభిన్న ప్రతిభావంతుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి మూడు నెలలకు ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ నిర్వహించి, అందులో వచ్చిన ఫిర్యాదులను వేగంగా పరిష్కరిస్తామని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే విన్న ప్రతిభావంతుల సమస్యలను కూడా ప్రత్యేక దృష్టితో పరిశీలిస్తామని భరోసా ఇచ్చారు. సంబంధిత శాఖ సిబ్బంది పిజిఆర్ఎస్ వద్దే విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామ సచివాలయాలకు వెళ్లే విభిన్న ప్రతిభావంతులకు వేగంగా సేవలు అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ఉద్యోగిగా పనిచేస్తున్న వారికి ఫీల్డ్ సర్వే బాధ్యతల నుంచి మినహాయింపు కల్పించే అవకాశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. ఇల్లు లేని ప్రతి కుటుంబానికి గృహం కల్పించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం 'హౌస్ ఫర్ ఆల్' పథకాన్ని ప్రారంభించిందని, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు కేటాయిస్తున్నట్లు చెప్పారు. నందికొట్కూరు నియోజకవర్గంలోని దేవాదాయ శాఖ భూమిలో కేటాయించిన 450 ప్లాట్ల సమస్యను త్వరితంగా పరిష్కరిస్తామని తెలిపారు. ప్రత్యేక సెలవులు, ప్రత్యేక వాష్‌రూమ్స్, ర్యాంపులు ఏర్పాటు వంటి అంశాలపై కూడా త్వరిత చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఛైర్మన్ గడుపూటి నారాయణ స్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రారంభించిన 'ఇంద్రధనస్సు' పథకంలో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, టిడ్కో గృహాల్లో గ్రౌండ్ ఫ్లోర్ కేటాయింపు, సబ్సిడీ రుణాలు, ఎంపిటిసి/జడ్పిటిసి పదవుల్లో రిజర్వేషన్, ప్రతి జిల్లాలో దివ్యాంగ భవన్ ఏర్పాటు వంటి వరాలు ఉన్నట్లు తెలిపారు. నెలకు రు.6,000 పెన్షన్, డయాలసిస్ పేషంట్లకు రు.10,000, మంచానికే పరిమితమైన వారికి రు. 15,000 మొదటి తేదీన అందజేస్తున్నట్లు వివరించారు.

తదుపరి విభిన్న ప్రతిభావంతుల సంఘాల నాయకులు మస్తాన్ వలి, మహేశ్వర్ రెడ్డి, లక్ష్మీ ఓబులేసు, సుబుల్ భాష, రమణయ్య, బాలసుబ్బయ్య, గంగాధర్, నాగన్న, సుబ్బారావు, సుబ్రహ్మణ్యం, రామకిషోర్, మరియా దాస్, సుధాకర్, జహీరుద్దీన్, గురుమూర్తి, రంగస్వామి, డా.గ్రేస్ తదితరులు మాట్లాడారు.

కార్యక్రమం ముగింపులో ఉత్తమ సేవలు అందించిన విభిన్న ప్రతిభావంతుల ఉద్యోగులను మొమెంటో, శాలువాలతో కలెక్టర్ మరియు ఛైర్మన్ సత్కరించారు. అనంతరం రాష్ట్ర ఛైర్మన్‌ను విన్న ప్రతిభావంతులు శాలువాతో ఘనంగా సత్కరించారు. నవజీవన్ చెవిటి పిల్లల సంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి.

# నంద్యాల- గుంతకల్లు మధ్య పగటి పూట రైళ్లు నడపండి సార్

## పార్లమెంట్ లో నంద్యాల రైల్వే సమస్యలపై గళమెత్తిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి




**పల్లె వెలుగు నంద్యాల న్యూఢిల్లీ**

నంద్యాల నుంచి గుంతకల్లుకు పగటి పూట రైళ్లు నడపాలనీ, నంద్యాల నుంచి వయా బేతంచెర్ల మీదుగా ఓర్వకల్లు పారిశ్రామిక కారిడార్ ను కలుపుతూ కర్నూలు (దుపాడు) వరకు కొత్త రైలు మార్గం వేయాలని బుధవారం పార్లమెంట్ లో నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి గలమెత్తారు. నంద్యాల నుండి గుంతకల్లు వైపు నాలుగు రైళ్లు ఉన్నాయనీ, ఆ నాలుగు రైళ్లు చాలా విచిత్రమైన సమయాల్లో ప్రయాణిస్తాయనీ, అన్ని రైళ్లు అర్ధరాత్రి 12:55, 1:30, 2:20, రాత్రి 8:20కి ఒక రైలు ఉందనీ, కాబట్టి రోజువారీ రైలు ప్రయాణికులు, విద్యార్థులు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్ళేవారు రైలులో ప్రయాణించే వేలాది మంది ఉన్నారనీ, కేంద్ర రైల్వే శాఖ మంత్రి దయచేసి ఈ మార్గానికి చాలా ఉపయోగకరంగా ఉండే రోజువారీ పగటిపూట మెమో రైలు లేదా ప్రయాణీకుల రైలును అందించమని అభ్యర్థిస్తున్నానని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పార్లమెంట్ లో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్టవ్ ను కోరారు. పార్లమెంట్ లో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్టవ్ సమాధానం ఇస్తూ నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి అడిగిన నంద్యాల, గుంతకల్లు మధ్య ఎంపీ శబరి నియోజకవర్గంలో పగటిపూట రైలు లేకపోవడం గురించి ఒక నిజమైన సమస్యను లేవనెత్తారనీ, నేను ఇది పరిశీలించాను. నంద్యాలలోని నిర్వహణ సౌకర్యాలకు సంబంధించి సాంకేతిక సమస్యలు ఉన్నాయని, గుంతకల్లులో ఐ సి ఎఫ్ కోచ్ ల కోసం కొంత నిర్వహణ సౌకర్యం ఉందని, కానీ నంద్యాలలో నిర్వహణ సౌకర్యం లేదని. కాబట్టి, కొంత పరిష్కారాన్ని కనుగొనమని, ఈ సమస్యను పరిష్కరించే మార్గాన్ని కనుగొనమని నేను రైల్వే నిపుణులు బ ృందాన్ని కోరాననీ, ఇక్కడ. నేను ఫీల్డ్ అధికారులతో కూడా త్వరలో వివరంగా చర్చిస్తానని, వీలైనంత త్వరలో పరిష్కారం కనుగొనబడిన వెంటనే, నేను ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి తెలియజేస్తానని కేంద్ర రైల్వే శాఖ మంత్రి హామీ ఇచ్చారు. అలాగే నంద్యాల నుంచి కర్నూలు కు కొత్త రైలు మార్గం ఏర్పాటు చేయాలని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పార్లమెంట్ లో రెండవ ప్రశ్నగా కేంద్ర రైల్వే శాఖ మంత్రి దృష్టికి తెచ్చారు. ప్రస్తుతం నంద్యాల నుండి డోన్ మీదుగా కర్నూలుకు రైలు మార్గం దాదాపు 130 కిలోమీటర్ల దూరం ఉందని, నంద్యాల నుండి వయా బేతంచెర్ల మీదగా ఓర్వకల్లు పారిశ్రామిక హాబ్ ను కలుపుతూ (దుపాడు ) కర్నూలు వరకు కొత్త రైలు మార్గం నిర్మిస్తే 60 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని, ఈ కొత్త రైలుకు 2023 లోనే డి పి ఆర్ నమోదు చేసి, వాస్తవానికి మంజూరు దశలో ఉందని, ఈ సమస్య పరిష్కారం చేసి కొత్త రైలు మార్గం వేయాలని పార్లమెంట్ లో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీవైష్టవ్ ద ృష్టికి తెచ్చారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఓర్వకల్లును పారిశ్రామిక హాబ్ గా ప్రకటించి అవసరమైన నిధులు, భూమి కేటా యించిందని, కాబట్టి, డీపీఆర్ కు నిధుల కేటాయింపు చేసి నంద్యాల నుంచి వయా బేతంచెర్ల మీదుగా కర్నూలుకు కొత్త రైలు మార్గం పూర్తి చేయాలని పార్లమెంట్ లో కేంద్ర రైల్వే మంత్రి ద ృష్టికి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి తెచ్చారు.

# ఎటువంటి అంతరాయం లేకుండా సాఫీగా ఎన్నికలు జరిగేలా చూడాలి

## జిల్లా కలెక్టర్



**భూపాలపల్లి డిసెంబర్ 10 పల్లె వెలుగు ప్రతినిధి:**

గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా మొగుళ్లపల్లి, గణపురం మండలాల్లో పోలింగ్ మెటీరియల్ పంపిణీ కేంద్రాలను సాధారణ ఎన్నికల పరిశీలకులు ఫణీంద్ర రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియ పారదర్శకంగా,నిష్పక్షపాతంగా పూర్తయ్యేలా ప్రతి దశలో నిబంధనలు పాటించాలని సూచించారు. పోలింగ్ సిబ్బందికి అందజేస్తున్న మెటీరియల్‌ను పూర్తిగా సక్రమంగా అందించాలని,సిబ్బంది మెటీరియల్ పరిశీలించాలని తెలిపారు. మెటీరియల్ పంపిణీ కేంద్రాల్లో ఏర్పాట్లు సంత ృప్తికరంగా ఉన్నాయని, పోలింగ్ రోజు ఎటువంటి అంతరాయం లేకుండా సాఫీగా ఎన్నికలు జరిగేలా అవసరమైన సూచనలు చేశారు. సిబ్బంది విధులను బాధ్యతగా నిర్వర్తించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్లు, ఎంపీడివోలు తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దారుణం..

## పాణ్యం నుంచి 60 వేల సంతకాల సమరం

- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ వైఎస్ఆర్సీపీ జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి
- నంద్యాల కలెక్టరేట్‌కు 60 వేల సంతకాల పత్రాల తరలింపు
- 15న గవర్నర్‌కు అందజేస్తామని వెల్లడి

**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో**

రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ పాణ్యం నియోజకవర్గంలో ప్రజా ఉద్యమం ఉధ ృతంగా సాగింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు చేపట్టిన ఈ ఉద్యమంలో భాగంగా పాణ్యం నియోజకవర్గ ప్రజల నుండి సేకరించిన 60 వేల సంతకాల పత్రాలను బుధవారం నంద్యాల జిల్లా కేంద్రానికి తరలించారు. కల్లూరు అర్బన్‌లోని తన నివాసం వద్ద వైఎస్ఆర్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి బొలెరో వాహనంలో ఈ పత్రాలను ఉంచి జెండా ఊపి సాగనంపారు. ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్ రాష్ట్రానికి 17 మెడికల్ కాలేజీలు తీసుకువస్తే, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు వాటిని ప్రైవేటీకరణ చేయడం దారుణమని ధ్వజమెత్తారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ చేపట్టామని, ఇందులో భాగంగా పాణ్యం నియోజకవర్గంలో 60 వేల మందితో సంతకాలు చేయించి ఒక ఉద్యమంలా నడిపామని తెలిపారు. ఈ వినతి పత్రాలను వచ్చే సోమవారం (15వ తేదీ) గవర్నర్‌కు అందజేయనున్నట్లు వెల్లడించారు.



**కూటమి పాలనలో కక్ష సాధింపులు..**

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోందని కాటసాని అన్నారు. ఎన్నికల్లో 25 లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు, అధికారంలోకి వచ్చాక ప్రైవేటు రంగంలోని ఉద్యోగులను తొలగిస్తున్నారని ఆరోపించారు. సబ్ స్టేషన్లలో పనిచేస్తున్న వైఎస్ఆర్సీపీ సానుభూతిపరులను అకారణంగా ఉద్యోగాల నుండి తొలగించడం అన్యాయమన్నారు. తమ హయాంలో 2 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని గుర్తు చేశారు. నిరుద్యోగ భ ృతి కోసం 'యువత మేలుకో' కార్యక్రమం కూడా నిర్వహించామని తెలిపారు.

**మద్యం ఏరులై పారుతోంది..**

రాష్ట్రంలో మంచి మందు ఇస్తాం తాగండి అని ఒక ముఖ్యమంత్రి చెప్పడం సిగ్గుచేటు అని కాటసాని ఎద్దేవా చేశారు. కూటమి హయాంలో గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోందని విమర్శించారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి వైఎస్ఆర్సీపీ నాయకులకు పనులు చేయవద్దని చెప్పడం, ప్రమాణం చేసిన వ్యక్తికి తగదని హితవు పలికారు. తనపై వ్యక్తిగతంగా అభాండాలు వేయడం సరికాదని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ కార్పొరేటర్లు, మండల నాయకులు, యువజన విభాగం అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్



**భూపాలపల్లి డిసెంబర్ 10 పల్లె వెలుగు ప్రతినిధి:**

బుధవారం అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ బొమ్మపూర్, సురారం, మహదేవ్‌పూర్ మరియు కాళేశ్వరం ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్శనలో ధాన్యం కొనుగోలు కార్యకలాపాలను వేగవంతం చేయాలని సంబంధిత కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్‌లను ఆదేశించారు. రైతులు తీసుకువస్తున్న ధాన్యం తేమ శాతం రోజువారీగా నిర్ధారించి పర్యవేక్షణ చేయాలని సూచించారు. ట్యాబ్ ఎంట్రీలను తప్పనిసరిగా 24 గంటలలోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మాయిశ్చర్ అప్‌డేషన్ రిజిస్టర్ మరియు డైలీ ప్రొక్యూర్మెంట్ అప్‌డేషన్ రిజిస్టర్లను పరిశీలించి, రికార్డుల నిర్వహణలో ఖచ్చితత్వం, పారదర్శకత మరియు సమయానుకూల సంరక్షణకు సంబంధించి అవసరమైన సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, డిఎం రాములు, డిసిఓ వాలియా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను సందర్శించిన జిల్లా ఎస్పీ



**భూపాలపల్లి డిసెంబర్ 10 పల్లె వెలుగు ప్రతినిధి:**

గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మొగుళ్లపల్లి ఇస్సిపేట సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను భూపాలపల్లి ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపిఎస్ పరిశీలించారు. ఎన్నికలు శాంతియుతంగా జరగేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎన్నికల నియమావళిని అతిక్రమించినట్లయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగేందుకు అభ్యర్థులు,రాజకీయ నాయకులు,స్థానిక ప్రజలందరూ పోలీసులకు సహకరించాల్సిందిగా ఎస్పీ కోరారు.

# ప్రశాంత ఎన్నికల నిర్వహణకు పటిష్ట బందోబస్తు

## - జిల్లా ఎస్పీ



**భూపాలపల్లి డిసెంబర్ 10 పల్లె వెలుగు ప్రతినిధి:**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో జరుగనున్న గ్రామపంచాయతీ మొదటి విడత ఎన్నికలను శాంతియుతం, పారదర్శకం, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు మొత్తం 570 మంది పోలీసు అధికారులు–సిబ్బందితో మూడు అంచెల భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ శ్రీ సిరిసెట్టి సంకీర్త్, ఐపీఎస్ తెలిపారు. ఎస్పీ కీలక సూచనలు ఎన్నికల సమయంలో ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు తావు లేదు. అధికారులు, సిబ్బంది పూర్తిగా అప్రమత్తంగా, క్రమశిక్షణతో పనిచేయాలి. ప్రవర్తన నియమావళి ఉల్లంఘన జరిగితే కఠిన చర్యలు తీసుకుంటాం. బందోబస్తు సిబ్బందికి అన్ని స్పష్టమైన ఆదేశాలు ఇప్పటికే జారీ అయ్యాయి. ఎన్నికల ఏర్పాట్ల వివరాలు జిల్లాలోని గణపురం, రేగొండ, గోరుకొత్తపల్లి, మొగలపల్లి మండలాలలో ఏకగ్రీవం అయిన 5 గ్రామపంచాయతీలను మినహాయించి, మొత్తం 86 గ్రామపంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అవసరమైన అన్ని భద్రతా చర్యలు మరియు లాజిస్టిక్ ఏర్పాట్లు పూర్తయ్యాయి. రేగొండ,గోరుకొత్తపల్లి బందోబస్తు దిశానిర్దేశం రేగొండ మండలంలో డీఎస్పీ సూర్యనారాయణ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఎన్నికల బందోబస్తు బాధ్యతలపై అధికారులకు, సిబ్బందికి సూచనలు ఇచ్చారు. గోరుకొత్తపల్లి మండలంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్ ఎస్పీ ఆదేశాల మేరకు బందోబస్తు సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఎస్పీ ముఖ్య నిర్దేశాలు పోలింగ్ స్టేషన్ భద్రత ఉదయం ప్రారంభం నుంచే విధి స్థానాలకు హాజరు కావాలి. ఓటర్లు ఇబ్బంది లేకుండా ఓటు వేయడానికి అవసరమైన సహాయాన్ని అందించాలి. పోలింగ్ కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిలో గుమికూడడం నిషేధం. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు కనిపిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలి. సున్నితమైన కేంద్రాల్లో ప్రత్యేక బందోబస్తు అదనపు పికెట్టింగ్ స్ట్రైకింగ్ ఫోర్సులు వీడియో రికార్డింగ్ టీంలు క్విక్ రెస్పాన్స్ టీంలు నిషేధిత కార్యకలాపాలు పోలింగ్ స్టేషన్ వద్ద పార్టీ చిహ్నాలు, ప్రచార సామగ్రి అనుమతి లేదు. పోలింగ్ బూత్‌లో మొబైల్ ఫోన్లు నిషేధం. ఓటర్లపై ఒత్తిడి, బెదిరింపులు, గుంపులు గుమికూడడం పూర్తిగా చట్టవిరుద్ధం. దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. చట్టపరమైన హెచ్చరికలు మద్యం పంపిణీ, డబ్బుల పంపిణీ, ఉద్రిక్తత స ృష్టించడం వంటి కార్యకలాపాలు జరిపితే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవు. విజయోత్సవ ర్యాలీలు పూర్తిగా నిషేధం. సోషల్ మీడియా లేదా ఇతర ప్లాట్‌ఫార్ములలో తప్పుడు ప్రచారం, వ్యక్తులను/పార్టీలను కించపరచే పోస్టులపై కూడా చర్యలు తీసుకుంటాం. పంచాయతీరాజ్ చట్టం సెక్షన్ 219 పోలింగ్ కేంద్రం మరియు సమీప ప్రాంతాల్లో ప్రచారం చేయడం నిషేధం. జిల్లాలో ఎన్నికలను శాంతియుతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ప్రతి పోలీస్ సిబ్బంది తన విధులను అత్యంత క్రమశిక్షణతో నైపుణ్యంతో నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ సూచించారు.

## అటవీ గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎస్సార్

- గ్రామాల అభివ ృద్ధి కొరకు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను సర్పంచ్ లుగా గెలిపించండి..
- గ్రామాలల్లో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు..



**భూపాలపల్లి డిసెంబర్ 10 పల్లె వెలుగు ప్రతినిధి:**
భూపాలపల్లి మండలంలోని అటవీ గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. మండలంలోని నాగారం, ఆజంనగర్, నందిగామ, దీక్షకుంట, పంబాపూర్, దూదేకులపల్లి గ్రామాలల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థుల గెలుపు కొరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ తో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలల్లో ఏర్పాటు చేసిన పబ్లిక్ కార్నర్ మీటింగ్ లలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే చాలా అభివ ృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో నాయకులు కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థుల గెలుపు కొరకు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలే పాలకులని, ప్రజా సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం క ృషి చేస్తోందన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో వివిధ అభివ ృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసినట్లు తెలిపారు.

## హక్కులు లేని మనిషి బానిసతో సమానం

- సెట్కూరు సీఈఓ డా. వేణు గోపాల్





**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో**
యువజన సంక్షేమ శాఖ, సెట్కూరు ఆధ్వర్యంలో ఎస్ వి ఆర్ ఇంజనీరింగ్ కళాశాల, అయ్యలూరు, నంద్యాల లో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంలో సెట్కూరు సీఈఓ డా. వేణు గోపాల్ మాట్లాడుతూ, మనిషి స్వతంత్రంగా జీవించేందుకు హక్కులు అనివార్యమని, హక్కులు లేని మనిషి బానిసలా ఉన్నట్లేనని పేర్కొన్నారు.ప్రపంచంలోని ప్రతి వ్యక్తి వివక్ష లేకుండా సమాన హక్కులతో జీవించాలని ఐక్యరాజ్యసమితి 1948 డిసెంబర్ 10న పారిస్‌లో సభ్య దేశాలంతా ఓ కీలక ఒప్పందంపై సంతకం చేసినట్లు గుర్తుచేశారు. అప్పటినుంచి ప్రతి సంవత్సరం మానవ హక్కుల దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా జరుపుకొంటున్నారు అని తెలియజేశారు.మన దేశానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధులు డాక్టర్ హన్సా జీవరాజ్ మెహతా సహా వివిధ దేశాల మేధావులు కలిసి మానవ హక్కుల సార్వజనీన ప్రకటనను రూపొందించారని తెలిపారు. ప్రతి సంవత్సరం ఒక ముఖ్య అంశాన్ని ప్రాధాన్యతగా తీసుకుని ఐక్యరాజ్యసమితి అమలు చేస్తుండగా, ఈ సంవత్సరం "మానవ హక్కులు, మన రోజువారీ అవసరాలు" అనే నినాదంతో వివిధ కార్యక్రమాలు ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్మెంట్ అధికారి శ్రీకాంత్ రెడ్డి గారు మాట్లాడుతూ భారతదేశంలో మానవ హక్కుల పరిరక్షణ చట్టం 1993లో ఆమోదించబడినదని, ఆ చట్టాన్ని 2006 లో సవరించి మార్పులు చేసినట్లు, మానవ హక్కుల పరిరక్షణకు సంబంధించి ఇండియా మానవ హక్కుల కమిషన్ బాధ్యత వహిస్తున్నదని వివరించారు.మానవ హక్కుల పరిరక్షణ మనందరి బాధ్యతగా వెల్లడించారు. కళాశాల చైర్మన్ వెంకట రామి రెడ్డి మాట్లాడుతూ మానవ హక్కుల గురించి తెలుసుకోవడమే కాదు, వాటిని సద్వినియోగ పరుచుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని, హక్కుల గురించి తెలుసుకుంటేనే అన్యాయాన్ని ప్రశ్నించే తత్వం అలవడుతుందని తెలిపారు. తదుపరి మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకొని నిర్వహించిన ప్రసంగ, వ్యాస రచన పోటీలను నిర్వహించిన విజేతలకు మెమెంటో మరియు ప్రశంసా పత్రాలు బహుకరించడమైనది. ఈ కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపాల్ హరి ప్రసాద్ రెడ్డి, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి భాస్కర్ రావు, సెట్కూరు పర్యవేక్షకులు శ్యాం బాబు పాల్గొన్నారు.

# అన్ని శాఖల సమన్వయంతో జిల్లాలో బాల్య వివాహాలను నిర్మూలించాలి

### వంద రోజుల జాతీయ ప్రచార కార్యక్రమం ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించాలి
### జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి



**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో**
అన్ని శాఖల సమన్వయంతో జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు క ృషి చేయాలని, ఇందు కోసం రూపొందించిన వంద రోజుల జాతీయ ప్రచార కార్యక్రమాన్ని పటిష్టంగా అమలుచేసి ప్రజల్లో సంపూర? అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు.

బాల్య వివాహాల నిర్మూలనకు వంద రోజుల జాతీయ ప్రచార కార్యక్రమం నిర్వహణపై బుధవారం కలెక్టరేట్ లోని మినీ కానారెన్స్ హాల్ లో మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులు, పోలీస్, విద్య, మున్సిపల్, పంచాయతీ రాజ్, డీఆర్డీఏ తదితర శాఖల జిల్లా అధికారులతో, వీడియో కానారెన్స్ ద్వారా తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్ లు, అంగన్వాడీ సూపర్వైజర్లు తదితరులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు సంబంధించి వంద రోజుల జాతీయ ప్రచారంలో మూడు దశల్లో నిర్వహించడం జరుగుతోందని, నవంబర్ 27 నుండి ప్రారంభమైన వంద రోజుల జాతీయ ప్రచార కార్యక్రమం వచ్చే ఏడాది మార్చి 8 వ తేదీ వరకు నిర్వహించబడుతుందన్నారు. మొదటి దశ నవంబర్ 27 నుండి డిసెంబర్ 31 వరకు విద్యాసంస్థలలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలు, అన్ని సంక్షేమ వసతి గ ృహాలలో బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ, కౌన్సిలింగ్, బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి వివరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అన్ని ప్రైవేటు, ప్రభుత్వ విద్యాసంస్థల్లో, వసతి గ ృహాల్లో బాల్యవివాహాలకు సంబంధించిన పోస్టర్లను ప్రదర్శించాలని కలెక్టర్ డిఇఓ, ఆర్ ఐ ఓ లను ఆదేశించారు. విద్యార్థుల్లో డ్రాప్ అవుట్ రేటు తగ్గించడం కూడా బాల్య వివాహాల నిర్మూలన లో కీలకం అని, ఆ దిశగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డిఇఓ ను ఆదేశించారు. ప్రతి పాఠశాలలో ఒక మహిళా నోడల్ ఆఫీసర్ ను నియమించాలని, విద్యార్థినులకు వివాహం చేస్తున్నట్లయితే, ఆ సమాచారాన్ని తెలియజేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీఈవోను ఆదేశించారు. రెండవ దశ లో జనవరి 1 నుండి జనవరి 31 వరకు మసీదులు, చర్చిలు, దేవాలయాలకు సంబంధించిన మత పెద్దలు, నాయకులకు, వివాహాలు నిర్వహించే వారికి ప్రత్యేక అవగాహన కలిగించాలని, 18 ఏళ్లు నిండని బాలికకు వివాహం జరిపితే చట్టపరమైన చర్యలు తప్పవని సూచించాలని కలెక్టర్ ఆదేశించారు.. మూడవ దశలో ఫిబ్రవరి ఒకటవ తేదీ నుంచి మార్చి 8 వ తేదీ వరకు గ్రామీణ స్థాయిలో అంగన్వాడి టీచర్లు, సచివాలయ సిబ్బంది, మహిళా పొదుపు సంఘాల ద్వారా విస్తృత అవగాహన కల్పించాలని, ఇంటింటా ప్రచారం, సమావేశాలు, మానవ హారాలు, గ్రామ సభల్లో ప్రత్యేక చర్చలు జరపాలని సూచించారు.. బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాలను గురించి వివరించాలని ఆదేశించారు..గ్రామ వార్డు సచివాలయంలో బాల్య వివాహాలకు సంబంధించి ఒక రిజిస్టర్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, పాఠశాలల్లో బాలికల వద్ద మహిళా పోలీస్, అంగన్వాడీ టీచర్, ఫోన్ నంబర్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా పోలీసులు డ్రాప్ అవుట్ బాలికలను గుర్తించి తిరిగి విద్యలో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో మహిళా పోలీస్-బాలికల మధ్య ఫ్రెండ్లీ కనెక్ట్ ఏర్పరచి, సమస్యలు వచ్చినప్పుడు నేరుగా చెప్పేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పోలీస్ శాఖ ద్వారా కూడా బాల్య వివాహ నిర్మూలనకు పటిష్టమైన చర్యలు తీసు కోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో కృష్ణగిరి, దేవనకొండ, ఎమ్మిగనూరు రూరల్ ప్రాంతాల్లో టీనేజ్ ప్రెగ్నెన్సీలు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామని, వాటిని అరికట్టడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మెడికల్ అధికారులను, తహసీల్దార్లను ఆదేశించారు. టీనేజ్ ప్రెగ్నెన్సీ వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, కుటుంబ-సామాజిక ప్రభావాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని అధికారులకు సూచించారు. రవాణా శాఖ ద్వారా బస్సులు, అన్ని వాహనాలపై పోస్టర్లను ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. బాల్య వివాహాల నివారణలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.సమీక్ష అనంతరం బాల్య వివాహాల నిర్మూలన కోసం వంద రోజుల ప్రచారానికి సంబంధించిన ప్రత్యేక ప్రతిజ్ఞ చేసి, ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు..అనంతరం కలెక్టర్, అధికారులు, సిబ్బంది, స్వఛ్ఛంద సంస్థలు బాల్య వివాహాల నిర్మూలనపై సంతకం కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా, ఐసిడిఎస్ పిడి విజయ, డిటిసి శాంతకుమారి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు జుబేదా బేగం, డిఆర్డిఏ పిడి రమణారెడ్డి, సోషల్ వెల్ఫేర్ డిడి రాధిక, బిసి వెల్ఫేర్ అధికారి ప్రసూన, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి, సిడిపిఓ లు తదితరులు పాల్గొన్నారు.

## గడివేముల పోలీసు స్టేషన్ ఆకస్మిక తనిఖీ

### ఫ్యాక్షన్ మరియు సమస్యాత్మకమైన గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచండి.
### రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకునేలా దిశ నిర్దేశం..
### జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ఐపీఎస్.



**పల్లె వెలుగు నంద్యాల క్రైమ్**
నేడు నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ఐపీఎస్ నంద్యాల సబ్ డివిజన్ పరిధిలోని గడివేముల పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్ పరిసరాలు ,లాకప్ గదులు పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.అనంతరం స్టేషన్ రికార్డులు, జనరల్ డైరీ, డ్యూటీ రోస్టర్, ఎఫ్ ఐ ఆర్ ఇండెక్స్, సి సి టి ఎన్ ఎస్ పనితీరు మరియు పెండింగ్ కేసుల వివరాలు మొదలగు రికార్డులను పరిశీలించి ఎప్పటికప్పుడు అప్ డేట్ చేసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో వివిద కేసులలో పట్టుబడిన వాహన వివరాలు కేసుల స్థితిగతులపై ఆరా తీశారు .రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తీసుకోవలసిన చర్యలు మరియు మైనర్ డ్రైవింగ్ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశిస్తూ సైబర్ క్రైమ్ నేరాల నియంత్రణకు గ్రామాలలో అవగాహన కల్పించాలని ఆదేశించారు.సమస్యాత్మకమైన గ్రామాలపై ప్రత్యక నిఘా ఉంచి అక్కడ ఎలాంటి అల్లర్లు,గొడవలు జరుగకుండా ప్రత్యక శ్రేద్ధ తీసుకోవాలి. విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా గ్రామాలకు వెళ్లి ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలన్నారు. నేర నియంత్రణలో సి సి కెమెరాల ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదులపై సత్వరం స్పందించి ఫిర్యాదిదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడి,క్షుణ?ంగా విచారించి నిర్దిష్ట సమయంలో చట్ట పరిధిలో పరిష్కరించాలని ఆదేశించారు. పాత నేరస్థులు, నేర చరిత్రగల వారు, అనుమానితులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా ఉంచి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి. స్టేషన్ నందు 112 టోల్ ఫ్రీ నంబర్ కు ఉపయోగించే ట్యాబ్ లు,వాటిని సిబ్బంది ఉపయోగిస్తున్న పనితీరుపై ఆరా తీసి, బీట్ డ్యూటీలలో పోలీసులు తప్పనిసరిగా ఉపయోగించాలని పలు సూచనలు చేయడం జరిగింది.

## పంట పొలాల్లో వ్యర్థాలను కాల్చరాదు

### మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర్ రెడ్డి



**మహానంది, పల్లె వెలుగు**
పంట కోతల తర్వాత వ్యర్థాలను కాల్చడంతో భూసారానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.బుధవారం మహానంది మండలం బుక్కాపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ...పంట వ్యర్థాలను పొలాల్లో కాల్చకుండా, కలియ దున్నటం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని రైతులకు సూచించారు.ఖరీఫ్ లో వరి కోతలు పూర్తి అయిన తర్వాత కొందరు రైతులు రబీ పంట సాగు కోసం వరి కోయ్యలను, దుబ్బులను కాల్చడం వలన వచ్చే పోగతో పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిపారు. పంట వ్యర్థాలను కాల్చడం వల్ల భూమిలోని సేంద్రీయ కర్బనము తగ్గిపోవడంతో పాటు, నేలకు తేమని నిలుపుకునే శక్తి తగ్గిపోతుందని అంతే కాకుండా భూమిలో ఉన్న మేలు కలిగించే సూక్ష్మజీవులు నశిస్తాయని, పర్యావరణ కాలుష్యం పెరిగి మానవాళి ఆరోగ్యానికి నష్టము వాటి ల్లుతుందన్నారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల వెలువడే కార్బన్ డై ఆక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్ వల్ల వాతావరణంలో వేడి అధికమవుతుంది కాబట్టి రైతులు పంట వ్యర్థాలను కాల్చకుండా పొలాల్లోనే కలియ దున్నడం వలన భూమిలో అన్ని రకాల పోషకాలు కలిసి భూసారం పెరుగు తుందని, పంట అవశేషాలలో నత్రజని, భా స్వరము,పొటాషియం, సూక్ష్మ పోషకాలు ఉంటాయని తెలిపారు. నేలలో కర్బన శాతం పెరిగి పంటల దిగుబడి కూడా పెరుగుతుంది కాబట్టి పంటల అవశేషాలను కాల్చకూడదని రైతులకు సూచిం చా రు.గ్రామ రెవెన్యూ అధికారి అక్బర్, గ్రామ ఉద్యాన అధికా రులు శిరీ ష, సుభాష్ చంద్రబోస్, బనానా ఎఫ్ పి ఓ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

## బాధ్యత( తెలియదా) లేదా?



**బండి ఆత్మకూరు పల్లె వెలుగు డిసెంబర్ 10 :** వాహనదారులు ద్విచక్ర వాహనాలపై వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించండి. ప్రమాదాలు జరిగినప్పుడు మీ ఆరోగ్యానికి హెల్మెట్ అనేది రక్షణ కవచముల హెల్మెట్ అనేది రక్షణ కవచంలా ఉపయోగపడుతుంది. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా బాధ్యతాయుతంగా మెలగండి. అంటూ పోలీస్ శాఖ గత కొద్ది నెలలుగా రోడ్డు ప్రమాదాలపై ప్రజలను జాగ ృతం చేయాలన్న ఉద్దేశంతో తరచుగా గ్రామాలలో ప్రజలను సమైక్యపరిచి అవగాహన సదస్సులను నిర్వహిస్తూ ఉన్నారు. మరోవైపు హెల్మెట్లు వాడని వ్యక్తులను పోలీస్ శాఖ వాహన తనిఖీల ద్వారా గుర్తించి జరిమానాలను సైతం విధిస్తున్నారు. అయినప్పటికీ వాహనదారులలో మార్పు రావడం లేదు బాధ్యత రాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. కోరి ప్రమాదాలను తెచ్చుకుంటున్నారు. ఆస్పత్రుల పాలై అవస్థలు పడుతున్నారు. కుటుంబంలో సంపాదనపరుడైన ప్రధాన వ్యక్తి ప్రమాదానికి గురైన పక్షంలో సదర్ వ్యక్తి కోలుకోవాలంటే కొన్ని నెలల సమయం పడుతుంది. ఈ లోపు దురద ృష్టవశాత్తు ప్రమాదానికి గురైన వ్యక్తి చనిపోతే అతన్నే నమ్ముకున్న కుటుంబం వీధిన పడాల్సి వస్తుంది. ఇలాంటి సంఘటనాన్ని ప్రజలకు వివరిస్తూ, రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా ఉండాలంటే హెల్మెట్ ను తప్పనిసరిగా వాడాల్సి ఉంటుందని పోలీసులు పదేపదే హెచ్చరిస్తున్నారు. హెల్మెట్ వాడకం అంటే అదేదో ముళ్ళ కిరీటాన్ని ధరించినట్లుగా కొంతమంది భావిస్తున్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు మితిమీరిన వేగం వద్దని కూడా పోలీసులు వాహనదారులను హెచ్చరిస్తూనే ఉన్నారు. హెల్మెట్ లేకపోవడం వల్ల మంగళవారం రాత్రి ఓ యువకుడు గాయాలపాలై ఆసుపత్రి పాలయ్యాడు. బండి ఆత్మకూరుకు చెందిన ఇస్మాయిల్ అనే యువకుడు నంద్యాలలో హమాలీగా పనిచేస్తూ ఉన్నాడు. మంగళవారం రాత్రి నంద్యాల నుండి ఇంటికి వస్తూ ఉన్నాడు. అదే సమయంలో సింగవరం గ్రామానికి చెందిన ఆకుల మద్దిలేటి అనే వ్యక్తి మోటార్ సైకిల్ పై డీజిల్ క్యాన్ పెట్టుకొని వస్తుండగా కొత్తపల్లి వద్ద జేబులోని సిగరెట్ ప్యాకెట్ కింద పడిపోయింది. బండిని ఆపిన మద్దిలేటి సిగరెట్ ప్యాకెట్ తీసుకొని వెళ్లేందుకు వెనక్కు వెళ్ళాడు. ఆ సమయంలో మోటార్ సైకిల్ పై వస్తున్న ఇస్మాయిల్ మద్దిలేటిని ఢీకొనడంతో ఇరువురు కింద పడ్డారు. ఇస్మాయిల్ తలకు బలంగా రక్త గాయాలు కాగా, మద్దిలేటి కి కాలు విరిగింది. వాహనాలపై ప్రయాణం చేసే ఇరువురికి హెల్మెట్ లేకపోవడం వల్ల ప్రమాదానికి గురై ఇరువురు కూడా ఆసుపత్రి పాలయ్యారు. ఇస్మాయిల్ హెల్మెట్ ధరించి ఉంటే తలకు ఏమాత్రం గాయాలు అయి ఉండేవి కావు. ప్రస్తుతం ఇరువురు కోలుకోవాలంటే చాలా రోజులు సమయం పట్టే అవకాశం ఉంది. వాహనదారులు ఇలాంటి సంఘటనలను ద ృష్టిలో పెట్టుకొని అయినా వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించి బాధ్యతగా వ్యవహరించాల్సి ఉంది.


## 120 టన్నుల యూరియా పంపిణీ



**మహానంది, పల్లె వెలుగు**

మహానంది మండలంలోని గాజులపల్లె, బొల్లవరం, తమ్మడపల్లె, తిమ్మాపురం, సీతారామపురం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల ద్వారా 120 టన్నుల యూరియాను పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన గ్రామాల్లోని యూరియా పంపిణీని పరిశీలించారు. రైతు సేవ కేంద్రాల్లో టైం స్లాట్ పద్ధతి ద్వారా టోకెన్లు తీసుకున్న రైతులు తమ సమయానికి యూరియాను తీసుకువెళ్లాలని ఏవో సూచించారు.

## హెల్మెట్ లేకుంటే ఈ చలానా.. పోలీసుల స్పెషల్ డ్రైవ్



**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో**

జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు బుధవారం నగరంలో హెల్మెట్ వినియోగంపై పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. డీఎస్పీ బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో వన్ టౌన్, ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించే వారికి, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి ఈ-చలానాలు విధించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసమే ఈ చర్యలు చేపట్టినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ, ట్రాఫిక్ సీఐ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# రైతుల సమస్యలు పరిష్కారమయ్యేంతవరకు సిపిఐ పోరాడుతూనే ఉంటుంది

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి. ఈశ్వరయ్య



**పల్లె వెలుగు నంద్యాల రూరల్**

రైతుల సమస్యలు పరిష్కారమయ్యేంతవరకు సిపిఐ పోరాడుతూనే ఉంటుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి. ఈశ్వరయ్య పేర్కొన్నారు. రైతులు పండించిన వరి, మొక్కజొన్న, పత్తి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, తుఫాను వలన నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరుతూ నంద్యాల మార్కెట్ యార్డ్ నుండి స్థానిక ఎంఆర్ఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం రాస్తారోకో నిర్వహించారు. సిపిఐ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన రాస్తారోకో కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి. ఈశ్వరయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందరరేగా ఈశ్వరయ్య మాట్లాడుతూ రైతులు ఇటీవల వచ్చిన మొంతా తుఫాను వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వారికి ఇంతవరకు నష్ట పరిహారం ఇవ్వలేదని వెంటనే తుఫాను వల్ల దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సిపిఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో ఈరోజు రైతుల కోసం ధర్నా చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో మొక్కజొన్న, వరి,టమాటా, ఉల్లి, పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, వాటికి గిట్టుబాటు ధర లేక దళారులు ఇష్టారీతిన కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అరటి రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని, గతంలో టన్ను 25 వేల రూపా యలుండగా నేడు 1000 నుండి 1500 రూపా యలకు పడిపో యిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరుగగా కేంద్రానికి కేవలం నాలుగు లక్షల ఎకరాల్లోనే పంట నష్టం జరిగిందని ప్రభుత్వ నివేదికలు అందజేసిందని, ఇది ఎంతవరకు సమంజసమని ఆయన నిలదీశారు. డోన్ ప్రాంతంలో టమోటా ధరలు పడిపోయాయని, అక్కడ జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామన్న ప్రభుత్వం కేవలం ప్రకటనలకే పరిమితమైందన్నారు. రైతుల రుణాలు రద్దు చేయాలని ఈ సందరరేగా ఆయన డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్రకార్యదర్శి వర్గసభ్యులు కె. రామాంజనేయులు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాకముందు రైతుల గురించి మాట్లాడి అధికారంలోకి వచ్చాక కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ ద్వంద్వ వైఖరిని అవలంబిస్తున్నాడని ఆరోపించారు. వేలాది ఎకరాల భూమిని పరిశ్రమల పేరిట కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని పేర్కొన్నారు. సినిమా రేట్లను పెంచుతున్న ప్రభుత్వం రైతుల పంటలకు గిట్టుబాటు ధర ఎందుకు కల్పించడం లేదని ఆయన నిలదీశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు మాట్లాడుతూ మొక్కజొన్న రైతులు గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్నారని, దళారులు 1200 రూపాయలకే మొక్కజొన్నను కొంటున్నారని, 3 వేల నుండి 4 వేల వరకు ధర చెల్లిస్తామన్న చంద్రబాబు రైతులకు వెంటనే గిట్టుబాటు ధరకు మొక్కజొన్న కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అరటి రైతులు తమకు గిట్టుబాటు ధర లేక పంటను దున్నేస్తున్నారని, ఇప్పటికైనా వరి పంటకు గిట్టుబాటులో కల్పించాలని లేకుంటే రానున్న రోజుల్లో రైతులతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధ ృతం చేస్తామని ఆయన డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బారెడ్డి, సోమన్న, సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు భార్గవ్, భాస్కర్, సుంకయ్య, రాధాక ృష?, రమేష్, రఘురామమూర్తి, మోటా రాముడు, నాగరాముడుతో పాటు సిపిఐ, రైతు సంఘం నాయకులు, మహిళా సమాఖ్య నాయకురాలు లక్ష్మీదేవితో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధితులకు సహాయం



**మహానంది, పల్లె వెలుగు**

మహానందిలోని ఈశ్వర్ నగర్ కాలనీకి చెందిన నాసరి రాజు క ృష?వేణి దంపతుల గుడిసె మంగళవారం రాత్రి ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతంతో దగ్ధమైన విషయం తెలిసిందే. బుధవారం మహానంది టీడీపీ నాయకురాలు ఉమాదేవి స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. అనంతరం కొంత నగదు, నిత్యావసర సరుకులు అందజేశారు.అగ్ని ప్రమాద బాధితులకు అండగా ఉండమని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బన్నూరు స్వామి రెడ్డి, దగ్గుపాటి పద్మజ, పటాల శ్రీను, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

## మా గ్రామాన్ని ప్రత్యేక గ్రామపంచాయతీగా చేయండి

### భాగ్యనగరానికి ప్రత్యేక గ్రామపంచాయతీ భాగ్యం



**దొర్నిపాడు డిసెంబర్ 10 పల్లె వెలుగు న్యూస్**

దొర్నిపాడు మండలంలోని భాగ్యనగరం గ్రామవాసులు జీవనోపాధి కొరకు గుంటూ రు, నెల్లూరు, ఒంగోలు, నుండి వలస వచ్చి సుమారు 70 సంవత్సరాలు కావ స్తుంది ,అప్పటినుండి ఇప్పటివరకు కూడా ప్రత్యేక పంచాయతీ గ్రామం లేక సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొండాపురం గ్రామం, పంచాయతీ కావడంతో ప్రతి పనికి కష్టాలు పడుతూ వెళ్లేవారు, అలాంటి వారి ఎన్నో ఏండ్ల సుదీర్ఘకాల గ్రామ ప్రజల కల తో భాగ్యనగరం గ్రామానికి ప్రత్యేక పంచాయతీ భాగ్యం కలగబోతోంది, ప్రత్యేక గ్రామపంచాయతీ కొరకు బుధవారం గ్రామంలో ఈవోపీఆర్డి శివ, గ్రామ సర్పంచి మాధవి లత గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గ్రామసభను ఏర్పాటు చేశారు, ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సురేంద్ర ,రమేష్ నాయుడు, సుభాష్ రెడ్డి, తదితరులు మాట్లాడుతూ ప్రస్తుతం మా గ్రామ జనాభా సుమారు వెయ్యి మంది కాగా 512 ఓట్లు ఉన్నాయన్నారు ప్రతి చిన్న పనికి వెళ్లాలన్న కూలి పని మానుకొని ప్రజలు వెళ్లాల్సి వస్తుందన్నారు ,గ్రామం అన్ని విధాల అభివృద్ధి చెందాలంటే ప్రత్యేక గ్రామం పంచాయతీగా ఉంటే మరింత అభివృద్ధి చెందిందని వారన్నారు, ఇందుకు గ్రామ సర్పంచ్ మాధవి లత అంగీకారం కూడా తెలపడంతో ఆమెకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు, అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ విడిపోయిన కూడా రెండు గ్రామాలు పోటీపడి అభివృద్ధి చేసుకుందామన్నారు ఇప్పటి లాగానే నన్ను ఆదరించాలని ఆమె కోరారు ,ప్రత్యేక గ్రామపంచాయతీ కొరకు గ్రామ ప్రజలు అంగీకారం తెలపడంతో అధికారులు ప్రత్యేక గ్రామపంచాయతీగా తీర్మానం చేసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతున్నట్లు వారు తెలిపారుఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ విజయలక్ష్మి,పంచాయతీ కార్యదర్శి హుసేని, వెంకటేశ్వర్ రెడ్డి శివరామకృష్ణ ,సత్యనారాయణ గ్రామ ప్రజలు పెద్దలు పాల్గొన్నారు

## అమ్మను వదల్లేం.. కడపను వదల్లేం

### ఒంటిమిట్ట లో ర్యాలీలు - ఉద్యమానికి ఊపిరి ఐదవ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్ష





**ఒంటిమిట్ట పల్లె వెలుగు ప్రతినిధి డిసెంబర్ 10:**

ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం అయిన డిసెంబర్ 10న ఒంటిమిట్ట మండల ప్రజలు తమ హక్కుల కోసం గళమెత్తారు. అమ్మను వదల్లేం%ఔ%కడప ను వదల్లేం అంటూ నినదించారు. ఒంటిమిట్ట మండలాన్ని అన్నమయ్య జిల్లాలో చేర్చే గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. దీనికి నిరసనగా జేఏసీ పిలుపుతో మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాలన్నీ ఒకే దిశగా కదిలాయి. వందలాదిగా గ్రామాల ప్రజలు, రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు, మరియు స్థానికులు ర్యాలీల్లో పాల్గొన్నారు. గ్రామాలనుండి తండోపతండాలుగా బయలుదేరి ఒంటిమిట్ట కేంద్రంలో కలిసే విధంగా ఏర్పాట్లు చేశారు. ర్యాలీలు శాంతియుతంగా, క్రమశిక్షణతో సాగాయి. ర్యాలీ లో మా ఊరును మా నుంచే దూరం చేస్తారా?, "మా అడుగులకు ఇంకా కడప ధూళే ఉంది"

చరిత్ర మర్చిపోకండి.. మమ్మల్నీ మర్చిపోకండి, పటంలో గీతలు గుండెల్లో గాయాలు, కడపతో నడిచాం కడపతోనే ఉంటాం, అమ్మను వదల్లేంకడప ను వదల్లేం, ఒంటిమిట్ట గుండె ఏడుస్తుంది, చేయొద్దు చేయొద్దు - కడపనుదూరం చేయొద్దు, కలపొద్దు కలపొద్దు- రాయచోటిలో కలపొద్దు, మా ఊరు - మా కడప, ఒంటిమిట్ట అంటే కడప.. కడప అంటే ఒంటిమిట్ట అనే నినాదాలు ఉద్యమానికి ప్రతీకగా నిలిచాయి. ప్రజల ఎటువంటి అంతరాయం లేకుండా క్రమశిక్షణతో , ర్యాలీని విజయవంతం చేశారు. ప్రజలు స్వయంగా వంటవార్పు కార్యక్రమం నిర్వహించారు. వంటకాలు సిద్ధం చేసి పాల్గొనేవారికి అందించడం ద్వారా పోరాటానికి కొత్త శక్తినిచ్చారు. ఇది కేవలం భోజనం మాత్రమే కాదుబీ పోరాటానికి ప్రతీకగా, ప్రజల సంకల్పానికి సహకారంగా నిలిచింది. వంటవార్పు ద్వారా ర్యాలీ, మానవహారం, దీక్షలతో ఏర్పడిన ఉద్యమ బలాన్ని మరింత బలపరిచింది.

**రిలే నిరాహార దీక్షలు - నిశ్శబ్ద శక్తి**

జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన రిలే నిరాహార దీక్షలు ఐదో రోజుకు చేరాయి. ఐదవ రోజు పాటూరు గంగిరెడ్డి, రఘురాం రెడ్డి, గురూజీ వర్మ, మల్లేష్ యాదవ్, షేక్ అమానుల్లా, దేరంగుల రామయ్య, గుర్రంకొండ శ్రీనివాసులు, జలగం వెంకటయ్య, నంద్యాల వెంకటేశు, బాణాలహరి , సుబ్బారెడ్డి రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు.



## తాసిల్దార్‌కు వీఆర్ఏల వినతి పత్రం

**రుద్రవరం. పల్లె వెలుగు :**

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసిల్దార్ ధోని ఆల్ ఫ్రెడ్ కు వినతిపత్రం అందజేశారు. బుధవారం వీఆర్ఏల సంఘం నాయకులు మాట్లాడుతూఏపీ వీఆర్ఏ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు, తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 16న మంగళగిరి సీసీఎల్ఏ కార్యాలయం వద్ద నిర్వహించతలపెట్టిన ధర్నా కార్యక్రమానికి సంబంధించిన వినతి పత్రాన్ని రుద్రవరం మండల వీఆర్ఏల సంఘం నాయకులు స్థానిక తహసీల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న వీఆర్ఏలకు తెలంగాణ తరహాలో పే స్కేల్ అమలు చేయాలని, నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్ఏలుగా నియమించాలని, అర్హులకు 70 శాతం ప్రమోషన్లు కల్పించడంతో పాటు మరణించిన వీఆర్ఏల కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రూ. 10,500 చాలీచాలని వేతనాలతో ఇబ్బంది పడుతున్న తమ గోడును ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు దేవదానం, అధ్యక్షులు హుస్సేన్ భాష, ఉప అధ్యక్షులు శ్రీనివాస్, కోశాధికారి సుధాకర్, ఇతర గ్రామ తలారులు పాల్గొన్నారు.

## ఉద్యానవన పంటలు సాగుచేసే రైతులకు అవగాహన.



**రుద్రవరం. పల్లె వెలుగు :**

రుద్రవరం మండలంలోని ఆలమూరు గ్రామంలో ఏపీఎంఐపీ జిల్లా ప్రాజెక్టు అధికారి కే శ్రీనివాసులు , నంద్యాల జిల్లా ఉద్యాన అధికారి నాగరాజు ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో అధికారులు రైతులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ రైతులకు 100% సబ్సిడీతో డ్రిప్ పరికరాలు అందించడం జరుగుతుందని అలాగే మిగతా రైతులకు 90 శాతం సబ్సిడీతో గరిష్టంగా 10 ఎకరాల వరకు డ్రిప్ పరికరాలు అందించడం జరుగుతుందని తెలిపారు. కావలసిన రైతులు రైతు సేవ కేంద్రాల సిబ్బందిని సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా తెలిపారు. అలాగే 100% సబ్సిడీపై ఆయిల్ ఫామ్ మొక్కలు సరఫరా చేస్తున్నామని కావలసిన రైతులు ఉద్యాన శాఖ అధికారిని సంప్రదించాలని తెలిపారు. రైతులు మొక్కజొన్నకు ప్రత్యామ్నాయంగా కూరగాయల సాగు చేపట్టాలని రైతులకు సూచించారు .ఈ కార్యక్రమంలో రుద్రవరం మండలం వ్యవసాయ అధికారి జి సుమతి విస్తరణ అధికారులు రాజు, మహిమ తబస్సుమ్, విలేజ్ అగ్రికల్చర్ సాల్మన్, ఫణి , రాజశేఖర్ మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## టవర్ ఏర్పాటుపై విచారణ



**బండి ఆత్మకూరు పల్లె వెలుగు డిసెంబర్ 10 :**

బండి ఆత్మకూర్ మండల పరిధిలో ఉన్న ఎర్రగుంట్ల గ్రామంలో ఎయిర్టెల్ ఏర్పాటు విషయంలో వివాదం ఏర్పడింది. ఈ విషయంపై డిప్యూటీ ఎంపీడీవో పురుషోత్తం బుధవారం సాయంత్రం గ్రామంలో విచారణ జరిపారు. గ్రామంలోని ఒక వ్యక్తికి సంబంధించిన ప్రైవేటు భూమిలో ఎయిర్టెల్ టవర్ ఏర్పాటు చేసేందుకు కంపెనీ ప్రతినిధులు పూనుకున్నారు. ఈ విషయంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ స్థానికులు కొందరు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు డిప్యూటీ ఎంపీడీవో పురుషోత్తం గ్రామాన్ని సందర్శించి విచారించారు. టవర్ ఏర్పాటు విషయంపై కంపెనీ ప్రతినిధులతో డిప్యూటీ ఎంపీడీవో మాట్లాడారు. టవర్ ఏర్పాటు విషయంలో కొందరు వ్యక్తులు అభ్యంతరం వ్యక్తం చేసిన కారణంగా విచారించడం జరిగిందని డిప్యూటీ ఎంపీడీవో పురుషోత్తం తెలిపారు. కంపెనీ ప్రతినిధులతో మాట్లాడిన మేరకు ఈ విషయంపై చర్చించడం జరుగుతుందని పురుషోత్తం తెలిపారు

# నంద్యాల పార్లమెంట్ పరిధిలోని పెండింగ్ రైల్వే ప్రతిపాదనల ఆమోదం కోసం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్టవ్ కు నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వినతి.

**పల్లె వెలుగు న్యూఢిల్లీ.**

నంద్యాల పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించిన పెండింగ్ రైల్వే ప్రతిపాదనల ఆమోదం కోసం అత్యవసరమని బుధవారం సాయంత్రం న్యూ ఢిల్లీ లోని రైల్వే మంత్రి కార్యాలయంలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్టవ్ కు నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి సమస్య వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ రైల్వే బోర్డులో ఆమోదం కోసం పెండింగ్‌లో ఉన్న అనేక ముఖ్యమైన రైల్వే ప్రతిపాదనలపై మీ జోక్యం కోరుతున్నామని, . ఈ ప్రతిపాదనలు నంద్యాల, కర్నూలు, కడప, విశాలమైన రాయలసీమ ప్రాంత ప్రజలకు చాలా ముఖ్యమైనవనీ, వీటిని సకాలంలో అమలు చేయడం వల్ల ప్రాంతీయ కనెక్టివిటీ, అభివృద్ధి బాగా పెరుగుతుందన్నారు.పురోగతి కోసం ఎదురుచూస్తున్న అతి ముఖ్యమైన ప్రాజెక్టులలో ఒకటి దూపాడు-బేతంచెర్ల కొత్త రైల్వే లైన్, దీని పొడవు 47.61 కి.మీ.. 09.06.2023న మంజూరు చేయబడిన తుది స్థాన సర్వే ఇప్పటికే పూర్తయిందనీ, వివరణాత్మక అంచనా, డి పి ఆర్ ప్రస్తుతం ప్రక్రియలో ఉన్నాయని, ఈ మార్గం కర్నూలు, నంద్యాల జిల్లాల మధ్య కీలకమైన లింక్‌గా పనిచేస్తుందన్నారు.ఓర్వకల్లు పారిశ్రామిక కారిడార్‌ను బలోపేతం చేస్తుంద, రాయలసీమ ప్రాంతంలో సరుకు రవాణాను పెంచుతుందని, డోన్ వద్ద లోకో రివర్సల్‌ను తొలగిస్తుందని, నంద్యాల, కర్నూలు మధ్య ప్రయాణ దూరాన్ని గణనీయంగా తగ్గిస్తుందని, నిధుల ముందస్తు కేటాయింపు, పరిపాలనా అనుమతి ఈ ప్రాంతం యొక్క ఆర్థిక, చలనశీలత అవసరాలకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి రైల్వే మంత్రి కి వివరించారు.సౌత్ సెంట్రల్ రైల్వే, సికింద్రాబాద్, రైల్వే బోర్డు ఆమోదం కోసం సౌత్ వెస్ట్రన్ రైల్వే, సదరన్ రైల్వేతో పరస్పరం అంగీకరించిన అనేక ప్రతిపాదనలను సమర్పించిందని. వీటిలో నర్సాపూర్-గుంటూరు డైలీ ఎక్స్‌ప్రెస్‌ను గుంటూరు-ధోన్ ఎక్స్‌ప్రెస్‌తో ధర్మవరం వరకు విలీనం చేయడం, పొడిగించడం ఉన్నాయని, ఇది చివరకు రాయలసీమ, విజయవాడ మధ్య రెండు దిశలలో చాలా కాలంగా ఎదురుచూస్తున్న పగటిపూట కనెక్టివిటీని అందిస్తుందన్నారు.హిందూపూర్ వరకు, ఇది తూర్పు- పశ్చిమ ప్రయాణ కారిడార్లను మరింత బలోపేతం చేస్తుందని, రాయలసీమలోని వెనుకబడిన ప్రాంతాల ప్రయాణికులకు ప్రయోజనం చేకూరుస్తుందని, అదనంగా, గుంటూరు-తిరుపతి ఎక్స్‌ప్రెస్ టెర్మినల్‌ను మచిలీపట్నం-తిరుచిరాపల్లి-మచిలీపట్నం వరకు విస్తరించడం, మార్చడం అనే ప్రతిపాదన, మచిలీపట్నం-విశాఖపట్నం సర్వీస్‌తో అనుసంధానించబడి, అరుణాచలం, కాణిపాకానికి ప్రయాణించే యాత్రికులకు కనెక్టివిటీని బాగా మెరుగుపరుస్తుందని, అదే సమయంలో పర్యాటకం, ప్రాంతీయ ఆర్థిక కార్యకలాపాలను పెంచుతుందన్నారు.చామరాజనగర్-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌ను నంద్యాల వరకు పొడిగించాలనే మరో అభ్యర్థన ఉందని, ఎందుకంటే ప్రస్తుతం నంద్యాల, కడప



జిల్లాల నుండి మైసూరు వైపు ప్రత్యక్ష కనెక్టివిటీ లేదుని, ఈ పొడిగింపు కర్ణాటకకు క్రమం తప్పకుండా ప్రయాణించే విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపార ప్రయాణికులు, యాత్రికులకు గణనీయమైన అంతరాన్ని పరిష్కరిస్తుందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వివరించారు.మా అన్ని ప్రతిపాదనలకు రైల్వే బోర్డు ఆమోదాలను వేగవంతం చేయడానికి, దూపాడు-బేతంచెర్ల కొత్త రైల్వే లైన్‌కు అవసరమైన నిధులను త్వరగా మంజూరు చేయడానికి మీ జోక్యం చేసుకోవాలని కోరుతున్నానని, పరిణామాలు ప్రాంతీయ కనెక్టివిటీని బాగా మారుస్తాయని, నంద్యాల చుట్టుపక్కల జిల్లాల ప్రజల దీర్ఘకాల ఆకాంక్షలను నెరవేరుస్తాయని, రాయలసీమ అభివృద్ధికి మీరు అందిస్తున్న మద్దతు, నిబద్ధతకు నా నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు ఎంతో కృతజ్ఞులై ఉంటారని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్టవ్ కు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి విజ్ఞప్తి చేశారు.

# ప్రజా వైద్యం ప్రజల హక్కు అన్న నినాదంతో, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోట్లాది గళాలు ఏకమవుతున్న "ప్రజా ఉద్యమం"

**బద్వేల్ డిసెంబర్ 10 (పల్లె వెలుగు)**

కార్యక్రమంలో భాగంగా నేడు బద్వేలు నియోజకవర్గంలో ర్యాలీ నిర్వహించారు. వైయస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపుకు స్పందిస్తూ, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు విశాలంగా పాల్గొన్న ఈ ర్యాలీని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ఎమ్మెల్యే డాక్టర్ సుధమ్మ చేతుల మీదుగా జెండా ఊపి ప్రారంభించారు. బద్వేలు టౌన్‌లోని ఎమ్మెల్యే పార్టీ కార్యాలయం నుండి జిల్లా పార్టీ కార్యాలయానికి ప్రజలు స్వచ్ఛందంగా సంతకం చేసిన పత్రాలను తరలించే ఈ ర్యాలీలో పాల్గొన్న అనంతరం ఇద్దరు నేతలు మాట్లాడుతూ, ప్రజల ప్రతి సంతకం ప్రభుత్వానికి ఇచ్చే శక్తివంతమైన హెచ్చరిక అని పేర్కొన్నారు. సేకరించిన అన్ని సంతకాలను పూర్తిగా డిజిటలైజ్ చేసి, 15వ తేదీన ఇవి జిల్లా కార్యాలయం నుంచి కేంద్ర కార్యాలయానికి పంపనున్నట్లు తెలిపారు. 17వ తేదీన వైయస్ జగన్ మోహన్ రెడ్డి గవర్నర్‌ను కలిసి కోటి సంతకాల పత్రాలను అందజేస్తారని వెల్లడించారు. కాగా, జగన్ ప్రజల ఆరోగ్య హక్కు కోసం నిర్మాణం ప్రారంభించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను కమీషన్ల కోసం ప్రైవేటీకరణలోకి నెట్టేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని, ఇది పేద ప్రజలు మరియు విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్రమైన దెబ్బ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ హయాంలో ఒకేసారి 17 మెడికల్ కాలేజీల నిర్మాణం మొదలయ్యి వాటిలో 7 పూర్తవగా, 5 కాలేజీల్లో అడ్మిషన్లు జరగగా, మిగతా కాలేజీల పనులు వివిధ దశల్లో ఉన్నప్పటికీ, ఇప్పుడు పీపీపీ పేరిట 10 కొత్త కాలేజీలను ప్రైవేటు పరం చేయడం తీవ్ర అన్యాయమని వారు పేర్కొన్నారు. ఈ తప్పుదారి వల్ల రాష్ట్రంలో మొత్తం 2,450 ఎంబీబీఎస్ సీట్లు విద్యార్థులు కోల్పోయే ప్రమాదం ఉందని అన్నారు. మెడికల్ కాలేజీలతో ఏర్పడే నర్సింగ్, పారా మెడికల్, వైద్య శిక్షణ సంస్థలు యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలను కల్పించగలవని, ప్రతి ప్రాంత అభివృద్ధికి ఇవి మూలస్తంభాలవుతాయని గుర్తుచేశారు. వైద్య విద్య పేదలకు అందుబాటులో ఉండాలనే వైయస్ జగన్ మోహన్ రెడ్డి దూరదృష్టిని దెబ్బతీసే నిర్ణయం ఇది







కాబట్టి, ప్రభుత్వం వెంటనే ప్రైవేటీకరణను వెనక్కి తీసుకొని, నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీలన్నింటినీ పూర్తిచేసి ప్రభుత్వమే నడపాలని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందని గోవిందరెడ్డి సుధమ్మ గార్లు స్పష్టం చేశారు.





## అక్రమ ఇసుక డంపు..

## సీజ్ చేసిన అధికారులు

హొళగుంద పల్లె వెలుగు డిసెంబర్ 10

అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపును హొలగుంద ఎస్ఐ దిలీప్ కుమార్ గురజాల సీజ్ చేశారు. మండలంలోని ముద్దటమాగి గ్రామానికి చెందిన మల్లికార్జున అనే వ్యక్తి అవసరం లేకపోయినా అక్రమంగా ఇసుకను తరలించి నిల్వ ఉంచిన ఇసుకను గుర్తించారు. ఇసుకను సీజ్ చేసి రెవిన్యూ ఇన్స్పెక్టర్ మహేష్ వారి సిబ్బంది కి అప్పగించినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఎవరైనా ఇసుక అక్రమ రవాణా, డంపులు ఏర్పాటు చేసినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఆదోని జిల్లా ప్రకటించేంతవరకు పోరాటం ఆపేది లేదు.



హొళగుంద పల్లె వెలుగు డిసెంబర్ 10

ఎల్లార్తి గ్రామం లో గ్రామ సర్పంచ్ కురువ చామండిశ్వరి ఆధ్వర్యంలో ఆదోని జిల్లా ఏర్పాటు చేయాలని ఆదోని బంద్ మద్దూతుగా ఎల్లార్తి గ్రామం లో గ్రామ ప్రజలు, విద్యార్థులు ర్యాలీ తో మద్దూతూ తెలుపుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు  మాట్లాడుతూ ఆలూరు, ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గంలు కలిపి ఆదోని జిల్లా ఏర్పాటు చేయాని, కర్నూలు జిల్లా కేంద్రం దాదాపు 130%ఎఎ% దూరం ఉంది ఆదోని జిల్లా ఏర్పాటు అయితే వలసలు పరిశ్రమలు ఆసుపత్రి జిల్లా కలెక్టర్ వారి కార్యాలయం, జిల్లా ఎస్పి వారి కార్యాలయం అన్ని  పనులు కూడా ప్రజలకు జరుగుతాయి ఆదోని జిల్లా ఏర్పాటు చేయాలని ఎన్నో రోజులు గా ధర్నాలు ర్యాలీలూ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు అన్నారు. ఆదోని జిల్లా ప్రకటించే వరకు పోరాటం ఆపే పరిస్థితి లేదు ఈ కార్యక్రమం లో మహంతేష్, శేఖప్ప, చిదానంద, రవి , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య



బండి ఆత్మకూరు పల్లె వెలుగు డిసెంబర్ 10 : బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న లింగాపురం గ్రామంలో చల్లా ఆదిశ్వర్ (22) అనే యువకుడు బుధవారం సాయంత్రం ఇంట్లో ఫ్యాన్ కు ఉరివేసుకొని మృతి చెందాడు. గ్రామస్తుల కథనం మేరకు ఉదయం తల్లి కూలి పనికి వెళ్ళినదని సాయంత్రం మృతుడి  తాత ఇంట్లోకి వెళ్లి చూడగా ఆదిశ్వర్ అప్పటికే ఇంట్లో ఫ్యాను ఉరివేసుకొని కనిపించాడని తెలుస్తోంది. క్రిందికి దింపి చూడగా అప్పటికే చనిపోయాడని తెలుస్తూ ఉంది. 20 రోజుల కిందట మృతుడు ఆదిశ్వర్కు అమ్మాయితో నిశ్చితార్థం జరిగిందని ఈలోగే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకోవడంతో తల్లి శోకసంద్రంలో మునిగిపోయింది

# సిపిఐ పార్టీని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలి






### శత వసంతాల సందర్భంగా ప్రతి చోట పార్టీ ఎర్ర జెండా ఎగరవేసి, మొక్కలు నాటాలి.

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి. ఈశ్వరయ్య .

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.

సిపిఐ పార్టీని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని, సిపిఐ వంద సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ప్రతి చోటా పార్టీ ఎర్ర జెండా ఎగరవేసి, మొక్కలు నాటాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నంద్యాల సిపిఐ పార్టీ కార్యాలయంలో సిపిఐ నంద్యాల జిల్లా సర్వసభ్య సమావేశాన్ని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య మాట్లాడుతూ సిపిఐ పార్టీ రాష్ట్ర సమావేశాలు, జాతీయ సమావేశాలు ముగించుకొని భవిష్యత్తులో తీసుకోవాల్సిన అంశాలపై చర్చించుకుని అన్ని స్థాయిల్లో పార్టీని ప్రజలకి తీసుకువెళ్లేందుకు విస్తృతంగా ప్రణాళికలు రూపొందించి వాటిని అమలు చేసే దిశగా ముందుకు వెళుతుందన్నారు. దేశంలో సిపిఐ పార్టీ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా డిసెంబర్ 20 నుండి 26 వరకు వారం రోజులపాటు వందేళ్ళ పార్టీ ఉద్యమాలను స్మరించుకుంటూ వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ అన్ని జిల్లాల్లో సభలు, సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని ఆయన వివరించారు.జాతీయ నాయకులు కూడా వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తూ కమ్యూనిస్టు నాయకుల త్యాగాలను, వారు చేసిన ప్రజా ఉద్యమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలా కార్యచరణ రూపొందించుకోవడం జరిగిందని, రేపు అనంతపురంలో సిపిఐ జాతీయ కార్యదర్శి డి. రాజా ఆధ్వర్యంలో దాదాపు 500 కమ్యూనిస్టు కుటుంబాలను ఒకే చోట చేసి పెద్ద ఎత్తున సభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి గ్రామంలో, ప్రతి నియోజకవర్గంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో శత వసంతాల సందర్భంగా ఎర్ర జెండాలు పాతాలని, అలాగే మొక్కలు నాటాలని ఆయన శ్రేణులకు పిలుపునిచ్చారు. పేదల పక్షాన నిలబడి పోరాడేది కమ్యూనిస్టులేనని, బ్యాంకులను జాతీయకరణ చేయడంలో కమ్యూనిస్టుల పాత్ర కీలకమన్నారు. కార్మికుల హక్కుల కోసం, ఉపాధి కోసం, వేతనాల కోసం పోరాటం చేసేది కమ్యూనిస్టులేనని ఆయన పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు వత్తాసు పలుకుతుందని, దేశ సంపద కొంతమంది కార్పొరేట్ల చేతుల్లో ఉందని, డబ్బులు దోచుకుని విదేశాలకు పోయిన వారిలో గుజరాతీయులే అధికమన్నారు. 2014లో డాలర్ విలువ 56 రూపాయలుండగా, ఇప్పుడు 90 రూపాయలకు చేరిందని, మోడీ హయాంలో రూపాయి పతనానికిది నిదర్శనమన్నారు.శ్రీశైలం డ్యాంలో ఫ్లంజ్ పూల్ ఏర్పడి 20 సంవత్సరాలు అవుతుందని, వాటిని పూడ్చకుంటే శ్రీశైలం డ్యాం పడిపోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు రాయలసీమ ప్రాజెక్టులైన్ గాలేరు నగరి, హంద్రీ నీవా తదితర ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు పోలవరం అమరావతి, జపం చేస్తున్నారని ఆరోపించారు. అభివృద్ధి పేరిట అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని అప్పులోబిలో నడుతున్నారని ఆరోపించారు ఎకరాల్లో రైల్వే స్టేషన్ 5000 ఎకరాల్లో ఏర్పాటు అవసరమా అంటూ ఆయన ప్రశ్నించారు. విమానాశ్రయం పేరిట భూములను అప్పనంగా కార్పొరేట్ కంపెనీలకు అప్పజెబుతున్నారని ఈశ్వరయ్య ఆరోపించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ లు ఒకరినొకరు పొగిడేందుకే సమయం సరిపోతుందని, పాలనపై వీరికి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. ఎంతసేపు కల్తీ లడ్డూల గురించి విమర్శిస్తూ దేవుడిని కూడా రాజకీయాల్లోకి లాగుతున్నారని ఆరోపించారు. చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాల్లో కేవలం నాలుగు వేల రూపాయలు పెన్షన్ మాత్రం వేస్తున్నాడని, మిగతా హామీలు ఏమయ్యాయని నిలదీశారు. రైతులకు 40,000 వేయాల్సి ఉండగా కేవలం 10,000 వేశారని, అలాగే నిరుద్యోగ భృతి ఇంతవరకు ఇవ్వలేదని, మహిళలకు ఇస్తానన్న 1500 రూపాయలు కూడా ఎక్కడ ఇచ్చాడంటూ ఆయన నిలదీశారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య, భాస్కర్, రమేష్, భార్గవ్, రఘురామ్ మూర్తి, మోటా రాముడు, నాగరాముడు, సిపిఐ నాయకులు సోమన్న, శ్రీనివాసులు, మహిళా నాయకురాలు లక్ష్మీదేవి, సుశీలమ్మ తో పాటు పెద్ద సంఖ్యలో సిపిఐ, ఏఐఎస్ఎఫ్,ఏఐవైఎఫ్ తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు, పుర ప్రముఖులు సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా మొదటిసారి నంద్యాలకు విచ్చేసిన ఈశ్వరయ్యను ఘనంగా సన్మానించారు.

# రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తూ పంట మార్పిడి పద్ధతులను ప్రోత్సహించాలి.

### వ్యవసాయ రంగంలో డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించండి.

### జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.

జిల్లాలో పర్యావరణ పరిరక్షణ, భూమి ఆరోగ్య సంరక్షణ, ప్రకృతి వనరుల సుస్థిర వినియోగాన్ని అభివృద్ధి చేయడం లక్ష్యంగా "ధర్తీ మాత బచావో అభియాన్" కార్యక్రమం ద్వారా రైతుల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి వ్యవసాయ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ధర్తీ మాత బచావో అభియాన్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, యాగంటిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డా. ధనలక్ష్మి, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, ఏడీఏలు, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి రాజకుమారి మాట్లాడుతూ, జిల్లాలో వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించడంతో పాటు మట్టి ఆరోగ్యాన్ని కాపాడే శాస్త్రీయ పద్ధతుల వైపు రైతులు మళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రసాయనిక ఎరువుల అధిక వినియోగం మట్టి సారాన్ని హరింప చేయడమే కాకుండా, పంటల నాణ్యతను దెబ్బతీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. దశలవారీగా రసాయనిక ఎరువుల వినియోగం తగ్గిస్తూ సహజ ఎరువులను ప్రోత్సహించాలన్నారు. ఇవి రైతులకు ఖర్చులు తగ్గించడమే కాకుండా, దీర్ఘకాలికంగా మెరుగైన దిగుబడులు అందిస్తాయని తెలిపారు. వరి, మొక్కజొన్న వంటి వరస పంటలతో పాటు పంట మార్పిడి పద్ధతులు అనుసరించడం ద్వారా మట్టిలో పోషకాలు సమతుల్యమవడంతో పాటు పురుగుమందుల అవసరం తగ్గి భూమి సారవంతం అవుతుందని ఆమె వివరించారు. ఈ విషయంపై రైతు సేవా కేంద్రాల ద్వారా అవగాహన కార్యక్రమాలు, శిక్షణా శిబిరాలు నిరంతరంగా నిర్వహించాలని వ్యవసాయ శాఖ అధికారులను సూచించారు.వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత వినియోగం అత్యవసరమని పేర్కొంటూ, డ్రోన్ టెక్నాలజీ ద్వారా పురుగుమందులు, ద్రవ ఎరువులు ఖచ్చితత్వంతో, తక్కువ సమయంలో, తక్కువ వ్యయంతో ప్రయోగించవచ్చని కలెక్టర్ అన్నారు. డ్రోన్ సేవలకు సంబంధించిన ప్రభుత్వ ప్రోత్సాహకాలు, శిక్షణలు, సబ్సిడీల వివరాలను ప్రతి రైతుకు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా, మండల స్థాయిల్లో డ్రోన్ డెమో కార్యక్రమాల సంఖ్యను పెంచాలన్నారు. ప్రతి వ్యవసాయ అధికారి హార్డ్‌వర్క్‌తో పాటు స్మార్ట్‌వర్క్ కూడా ప్రదర్శించాలని, చేసిన పని క్షేత్రస్థాయిలో స్పష్టంగా కనిపించాలన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల స్థాయిలో ర్యాంకింగ్ విధానాన్ని అమలు చేసే అవకాశాలు ఉన్నందున, ప్రతి అధికారి తమ పనితీరును మెరుగుపరుచుకోవాలని సూచించారు. జిల్లాలో సాగు చేసిన పంటలు రైతులకు సరైన ఆదాయం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.



# కాకనూరును సందర్శించిన ఆర్జెడి

**బండి ఆత్మకూరు పల్లె వెలుగు డిసెంబర్ 10:**
బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న కాకునూరు గ్రామాన్ని రీజినల్ డైరెక్టర్ శ్రీనివాసరావు బుధవారం సందర్శించారు. పంట కోత ప్రయోగం నిర్వహించిన విధానాన్ని కేంద్ర గణాంకాల అధికారుల సమక్షంలో క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. వ్యవసాయ ప్రణాళికలకు పంట కోత ప్రయోగాలు ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. గతంలో చేసిన వరి కోత ప్రయోగాన్ని పరిశీలించడం జరిగిందని అధికారులు నమోదు చేసిన గణాకాలను కూడా పరిశీలించడం జరిగిందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పంట వివరాలను పంట రకాలను పరిశీలించామని అధికారులు నమోదు చేసిన రికార్డులను క్షేత్రస్థాయిలో 20 సర్వే నంబర్ల పట్ల కోత ప్రయోగాన్ని ఆర్జెడి పరిశీలించారు. ఆర్జెడి వెంట కేంద్ర గణాంకాల కర్నూలు జిల్లా అధికారి అమృత డిప్యూటీ గణాంకాల అధికారి నాగప్రసాద్, వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్ రెడ్డి, ఎంపీఈఓ యశోద, విఆర్ఓ నాగేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

# గడివేముల పోలీసు స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేసిన నంద్యాల

## జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్..



**గడివేముల పల్లె వెలుగు దినపత్రిక**
నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ నంద్యాల సబ్ డివిజన్ పరిధిలోని గడివేముల పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్ పరిసరాలు ,లాకప్ గదులు పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

అనంతరం స్టేషన్ రికార్డులు, జనరల్ డైరీ, డ్యూటీ రోస్టర్, %ఖీ×=% ఫైర్ ఇండెక్స్, పెండింగ్ కేసుల వివరాలు మొదలగు రికార్డులను పరిశీలించి ఎప్పటికప్పుడు అప్ డేట్ చేసుకోవాలని ఆదేశించారు.

పోలీస్ స్టేషన్ ఆవరణలో వివిద కేసులలో పట్టుబడిన వాహన వివరాలు కేసుల స్థితిగతులపై ఎస్ఐ నాగార్జున రెడ్డిని ఆరా తీశారు .

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తీసుకోవలసిన చర్యలు మరియు మైనర్ డ్రైవింగ్ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశిస్తూ సైబర్ క్రైమ్ నేరాల నియంత్రణకు గ్రామాలలో అవగాహన కల్పించాలని ఆదేశించారు.

సమస్యాత్మకమైన గ్రామాలపై ప్రత్యక నిఘా ఉంచి అక్కడ ఎలాంటి అల్లర్లు,గొడవలు జరుగకుండా ప్రత్యక శ్రేద్ధ తీసుకోవాలి. విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా గ్రామాలకు వెళ్లి ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలన్నారు. నేర నియంత్రణలో కెమెరాల ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదులపై సత్వరం స్పందించి ఫిర్యాదిదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడి,క్షుణ్ణంగా విచారించి నిర్దిష్ట సమయంలో చట్ట పరిధిలో పరిష్కరించాలని ఆదేశించారు.

పాత నేరస్థులు, నేర చరిత్రగల వారు, అనుమానితులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా ఉంచి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి.

స్టేషన్ నందు 112 టోల్ ఫ్రీ నంబర్ కు ఉపయోగించే ట్యాబ్ లు,వాటిని సిబ్బంది ఉపయోగిస్తున్న పనితీరుపై ఆరా తీసి, బీట్ డ్యూటీలలో పోలీసులు తప్పనిసరిగా ఉపయోగించాలని పలు సూచనలు చేయడం జరిగింది.






# గర్జించిన ఆదోని ప్రజలు





**ఆదోని జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ తో జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో బంద్ కార్యక్రమం.**
**అందులో పాల్గొన్న అన్ని పార్టీల నాయకులు కార్యకర్తలు.**
**ఆదోని జిల్లా గా ప్రకటించకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తాం.**
**ఆదోని జిల్లా సాధన సమితి పీఏసీ.**

**ఆదోని పల్లె వెలుగు డిసెంబర్ 10**
కర్నూలు జిల్లాలోని ఆదోనిని ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలనే డిమాండ్‌తో ఆదోని కర్నూల్ జిల్లా సాధన సమితి జేఏసీ (జాయింట్ యాక్షన్ కమిటీ) ఆధ్వర్యంలో బుధవారం (డిసెంబర్ 10, 2025) ఆదోని పట్టణంలో బంద్‌కు పిలుపునిచ్చారు.?ముఖ్య అంశాలు ?డిమాండ్ ఆదోనిని ప్రత్యేక జిల్లా కేంద్రంగా ప్రకటించాలి. పశ్చిమ ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్షగా ఈ డిమాండ్ బలంగా ఉంది.?బంద్‌కు మద్దతు ఈ బంద్‌కు అన్ని రాజకీయ పార్టీలు (కూటమి పార్టీలతో పాటు వైకాపా, ఉభయ కమ్యూనిస్టు పార్టీలు), కుల సంఘాలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు మద్దతు తెలిపాయి. దీనిని 'ఆల్ పార్టీ' బంద్‌గా ప్రకటించారు.?బంద్ ప్రభావం కారణంగా విద్యాసంస్థలు ముందుగానే సెలవులు





ప్రకటించాయి.?ఆర్టీసీ డిపో ముందు జేఏసీ నాయకులు తెల్లవారుజాము నుంచే రోడ్డుపై బైఠాయించడంతో బస్సులు బయటకు రాలేదు.ప్రధాన కూడళ్లలో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. వ్యాపారులు, దుకాణదారులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని తమ మద్దతును తెలియజేశారు.?చర్యలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకుంటున్నారు.రాజకీయ పరిణామాలు ఆదోని జిల్లా ఏర్పాటుపై రాష్ట్రస్థాయిలో నూ చర్యలు చేపట్టాలి.

# ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై ప్రజల సంతృప్తి స్థాయిని మరింత మెరుగుపరచాలి

**క్షేత్రస్థాయిలో సేవల నాణ్యత పెంపు పై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి.**
**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**

**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.**
ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలులో ప్రజల సంతృప్తి స్థాయిని పెంచే దిశగా సమర్ధవంతమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం నాడు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ (ప్రజల సంతృప్తి స్థాయి) పై మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, డీఆర్వో రాము నాయక్, సర్వే ఏడి రామ్మోహన్, పిజిఆర్ఎస్ ప్రత్యేకాధికారి ఉమామహేశ్వరి తదితర అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సేవలపై ప్రజల నిజమైన అభిప్రాయాన్ని తెలుసుకునేందుకు ఐవిఆర్ఎస్, వాట్సాప్ గవర్నర్స్, క్యూఆర్ కోడ్ వంటి మూడు విభిన్న మాధ్యమాల ద్వారా ఫీడ్‌బ్యాక్ సేకరణ చేపడుతున్నట్లు తెలిపారు. రెవెన్యూ, రీ-సర్వే, పిజిఆర్ఎస్, గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు చేరుతున్న సేవల నాణ్యతను ప్రభుత్వం క్రమం తప్పకుండా పరిశీలిస్తోందని వివరించారు. ప్రజలకు అందే సేవలపై ఎటువంటి లోపాలు లేకుండా, ఆలస్యం చేయకుండా, ప్రతి శాఖ అధికారి బాధ్యతతో వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ పనితీరును అంచనా వేయడానికి థర్డ్ పార్టీ ధృవీకరణ కూడా జరుగుతోందని ఆమె పేర్కొన్నారు. ప్రజల సంతృప్తి ప్రభుత్వ పనితీరుకు ప్రతిబింబం కాబట్టి, ప్రతి విభాగం మరింత చురుకుదనం, పారదర్శకతతో పని చేసి, సేవల నాణ్యతను మరింతగా పెంచాలని సూచించారు. అనంతరం ప్రజా






అభిప్రాయం సేకరణ కోసం రూపొందించిన ప్రశ్నావళిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించి, అధికారులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు.

# బాలికలుఋుతు క్రమ పరిశు భ్రతపై అవగాహన అవసరం

## డాక్టర్ అనుప్రియ





**ఆళ్లగడ్డ ప్రతినిధి డిసెంబర్ 10 పల్లె వెలుగు**

ఆడపిల్లలు ఋుతుక్రమ పరిశుభ్రతను పాటించడం ద్వారా ఆరోగ్యకరంగా ఉండవచ్చని నంద్యాలకు చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ అనుప్రియ సూచించారు. ఆళ్లగడ్డలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం రోటరీ ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్,ఋుతుక్రమ పరిశుభ్రతపై డాక్టర్ టీఎంసీ అనుప్రియ (టీఎంసీ వేణుగోపాల్ కోడలు) అవగాహన కల్పించారు. ఋుతుక్రమ పరిశుభ్రత సక్రమంగా పాటించకపోతే జబ్బుల బారిన పడే ప్రమాదం ఉంటుందన్నారు. క్యాన్సర్ తదితర జబ్బులపై కూడా డాక్టర్ అనుప్రియ విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అలాగే ప్రస్తుత సమాజంలో ఆడపిల్లలు లైంగిక వేధింపులకు గురి అవుతున్న సంఘటనలు ఎన్నో చూస్తున్నామని అన్నారు. విద్యార్థినులు గుర్తుతెలియని వ్యక్తులు వారికి చాక్లెట్లు, బిస్కెట్లు ఆశ చూపి వారిని టచ్ చేసే అవకాశం ఉండడంతో ప్రధానంగా అమ్మాయిలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ లపై అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ అను ప్రియ సూచించారు.

అలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు తల్లిదండ్రులకు ఈ విషయాన్ని తెలియ చేయాలని సూచించారు. ఋుతుక్రమం అయిన సమయంలో ప్యాడ్స్ మార్చుకునే సమయంలో ప్రతిసారి చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గైనకాలజిస్ట్ డాక్టర్ అనుప్రియ అవగాహన కల్పించారు. ఇన్నర్ విల్ క్లబ్బు అధ్యక్షులు కవిత ప్రధాన కార్యదర్శి బైసాని ఉమామహేశ్వరి ప్రసంగించారు.

పాఠశాల హెచ్ఎం పర్వత్ నసీం ఈ సందర్భంగా మాట్లాడుతూ.

పాఠశాల విద్యార్థినులకు చక్కని విషయాలపై అవగాహన కల్పించిన గైనకాలజిస్ట్ డాక్టర్ అనుప్రియకు, ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ చార్టెడ్ ప్రెసిడెంట్ టీఎంసీ గాయత్రీ దేవి, ప్రముఖ పారిశ్రామికవేత్త, రోటరీక్లబ్ డిస్టిక్ ఆఫీసర్ టీఎంసీ వేణుగోపాల్, ఇన్నర్ విల్ క్లబ్ ప్రెసిడెంట్ కవిత, సెక్రటరీ బైసాని ఉమా మహేశ్వరి, ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు రమాబాయి, టీఎస్ విజయలక్ష్మి, శ్రీ లక్ష్మీదేవి, విజయ గీత, స్వర్ణ, శ్రీదేవి, పద్మజ వల్లి, వృక్షయజ్ఞం నిర్వాహకురాలు లావణ్య, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.




# రిలే దీక్షలకు మద్దతు తెలపాలని వైయస్సార్ జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డికి జేఏసీ నాయకులు వినతి

**మంత్రాలయం పల్లె వెలుగు డిసెంబర్ 10**

ఆదోని జిల్లా కోసం 12వ తేదీ నుండి మంత్రాలయంలో జరగబోవు రిలే నిరాహార దీక్షలకు వైఎస్ఆర్సిపి పార్టీ నుండి మద్దతు తెలపాలని బిఎస్ఎస్ మరియు ఆదోని సాధన సమితి జేఏసీ నాయకులు స్వామినాథం, ఆదము లు వైసీపీ కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి కి ఆహ్వాన పత్రం అందజేసి పార్టీ నుండి సంపూర్ణ మద్దతు ప్రకటించాలని కోరారు, ప్రజా సౌలభ్యం కోసం ఆదోని జిల్లా సాధించేంతవరకు ఉద్యమాలలో భాగస్వాములు కావాలని అన్నారు.

# 18 నెలల్లో రూ.25 లక్షల కోట్లు..

## రాష్ట్రానికి పెట్టుబడులు వరదలా వస్తున్నాయి: కాలవ శ్రీనివాసులు

**చంద్రబాబు, లోకేశ్ చొరవతో రాష్ట్రానికి పెట్టుబడుల వెల్లువ**

**రాష్ట్రంలో 26 లక్షల ఉద్యోగావకాశాల కల్పన**

**పెట్టుబడుల ఆకర్షణలో నారా లోకేశ్ ది కీలకపాత్ర అని కాలవ వెల్లడి**



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన 18 నెలల్లోనే రూ.25 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని, తద్వారా 26 లక్షల ఉద్యోగావకాశాలు అందుబాటులోకి రానున్నాయని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలనా దక్షత, మంత్రి నారా లోకేశ్ అవిశ్రాంత కృషితో రాష్ట్రానికి పెట్టుబడులు వరదలా వస్తున్నాయని ఆయన హర్షం వ్యక్తం చేశారు. బుధవారం నాడు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ, "కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో దేశ, విదేశీ దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించడానికి ముందుకొస్తున్నాయి. చంద్రబాబు ఆర్థిక శాస్త్రంలో నిష్ణాతులు కాగా, ఆయన అనుభవం రాష్ట్రానికి శ్రీరామరక్షగా మారింది. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో సైతం పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాదిన్నర కాలంలోనే రూ.25 లక్షల కోట్లకు పైగా విలువైన ఒప్పందాలు జరిగాయి. అనేక పరిశ్రమల పనులు కూడా ప్రారంభమయ్యాయి. ఈ పెట్టుబడుల ద్వారా సుమారు 26 లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుంది" అని వివరించారు.

## పెట్టుబడుల ఆకర్షణలో లోకేశ్ కృషి అమోఘం

రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడంలో మంత్రి నారా లోకేశ్ కీలకపాత్ర పోషిస్తున్నారని కాలవ కొనియాడారు. "ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీని నిలబెట్టుకునే దిశగా ప్రభుత్వం పనిచేస్తోంది. అందులో భాగంగా లోకేశ్ విద్యాశాఖలో సంస్కరణలు తెస్తూనే, పారిశ్రామికవేత్తలను కలిసేందుకు ప్రపంచ దేశాల్లో పర్యటిస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న అవకాశాలను వారికి వివరిస్తూ, వారిలో భరోసా కల్పిస్తున్నారు. ఆయన కృషితోనే విశాఖ సమ్మిట్‌లో కుదిరిన ఒప్పందాల్లో రూ.7 లక్షల కోట్ల పెట్టుబడులు క్షేత్రస్థాయిలో కార్యరూపం దాలుస్తున్నాయి" అని తెలిపారు. జగన్ అసమర్థ పాలనలో 24 శాతానికి చేరిన నిరుద్యోగిత రేటు, నేడు పారిశ్రామికాభివృద్ధి కారణంగా 8.2 శాతానికి తగ్గిందని పేర్కొన్నారు.

**రెన్యూవబుల్ హబ్‌గా రాయలసీమ**

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాయలసీమలో ఒక్క పరిశ్రమ కూడా రాలేదని, కానీ నేడు కూటమి ప్రభుత్వంలో ఆ ప్రాంతం రిన్యూవబుల్ ఎనర్జీ హబ్‌గా వెలిగిపోతోందని కాలవ శ్రీనివాసులు అన్నారు. "గతంలో చంద్రబాబు అనంతపురం జిల్లాకు కియా పరిశ్రమను తీసుకొస్తే, దాని అనుబంధ సంస్థలను జగన్ ప్రభుత్వం తరిమికొట్టింది. కానీ నేడు రెన్యూ, చింతా వంటి సంస్థలతో రాయలసీమ పారిశ్రామికంగా పురోగమిస్తోంది. కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామికవాడల అభివృద్ధికి కేంద్రం సహకారంతో రూ.4,900 కోట్లు ఖర్చు చేస్తున్నాం" అని చెప్పారు.

గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగాలు లేక దాదాపు 4 వేల మంది యువత ఆత్మహత్యలు చేసుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడులపై వైసీపీ నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని కోరారు.

"జగన్ అరాచక పాలనను ప్రజలు తిరస్కరించారు. చంద్రబాబు నాయకత్వం, పవన్ కల్యాణ్ నిబద్ధత, ప్రధాని మోదీ ఆశీస్సులతో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళుతోంది. వైసీపీ ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులను ఆపలేరు" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# కెనడాలో లోకేశ్ మెగా ఇన్వెస్ట్‌మెంట్ డ్రైవ్...

**ఏపీలో పెట్టుబడులకు దిగ్గజాలకు ఆహ్వానం**

**కెనడా పర్యటనలో మంత్రి నారా లోకేశ్ బిజీబిజీ**

**బిజినెస్ కౌన్సిల్ ఆఫ్ కెనడా అధ్యక్షుడితో కీలక సమావేశం**

**నల్లమలలో స్టెర్లింగ్ రిసార్ట్స్ ఏర్పాటుకు ఫెయిర్‌ఫాక్స్ సంస్థకు విజ్ఞప్తి**

**ఏపీ మౌలిక సదుపాయాల రంగంలో పెట్టుబడులకు సీపీపీఐబీకి ఆహ్వానం**

**ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని హామీ ఇచ్చిన కెనడా సంస్థలు**




ఆంధ్రప్రదేశ్‌కు భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ కెనడా పర్యటనలో కీలక సమావేశాలు నిర్వహించారు. పర్యటనలో భాగంగా టొరంటోలో ఆయన కెనడాలోని ప్రముఖ వాణిజ్య, ఆర్థిక దిగ్గజాలతో వరుసగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలను వివరిస్తూ, భాగస్వాములు కావాలని వారిని ఆహ్వానించారు.

**బిజినెస్ కౌన్సిల్ ఆఫ్ కెనడాతో భేటీ**

ముందుగా, బిజినెస్ కౌన్సిల్ ఆఫ్ కెనడా (%దీజజ%) అధ్యక్షుడు గోల్డీ హైదర్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ముఖ్యమంత్రి చంద్రబాబు సుదీర్ఘ పాలనానుభవం, దార్శనికతతో గత 18 నెలల్లోనే ఏపీకి రూ. 20 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయి. మాది 'స్పీడ్ ఆఫ్ డూయింగ్' విధానం. 1053 కి.మీ తీరప్రాంతం, ఆరు పోర్టులు, ఆరు విమానాశ్రయాలతో రాష్ట్రం కనెక్టివిటీలో ముందుంది. మరో ఆరు నెలల్లో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు మూలపేట, మచిలీపట్నం, రామాయపట్నం పోర్టులు అందుబాటులోకి వస్తాయి. గూగుల్, ఆర్సెలర్ మిట్టల్, రిలయన్స్ వంటి ప్రపంచ స్థాయి సంస్థలు ఇప్పటికే పెట్టుబడులు పెట్టాయి. ఏపీలో కెనడియన్ పెట్టుబడిదారులను ప్రోత్సహించండి" అని కోరారు. దీనికి గోల్డీ హైదర్ సానుకూలంగా స్పందించారు. తమ కౌన్సిల్‌లో 150కి పైగా ప్రముఖ సంస్థలు సభ్యులుగా ఉన్నాయని, ఏపీలో పెట్టుబడుల అవకాశాలను వారి దృష్టికి తీసుకెళ్లి, తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.



# కడప మేయర్ ఎన్నికకు లైన్ క్లియర్...

**మాజీ మేయర్ సురేశ్ బాబు పిటిషన్ కొట్టివేసిన హైకోర్టు**
**కడప మాజీ మేయర్ సురేష్ బాబుకు హైకోర్టులో ఎదురుదెబ్బ**
**మేయర్ ఎన్నిక నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ వేసిన పిటిషన్ కొట్టివేత**
**ఎన్నికల ప్రక్రియను నిలిపివేయాలన్న అభ్యర్థన తిరస్కరణ**
**షెడ్యూల్ ప్రకారమే కడప మేయర్ ఎన్నికకు మార్గం సుగమం**

కడప మాజీ మేయర్ కె. సురేశ్ బాబుకు హైకోర్టులో చుక్కెదురైంది. కడప నగర మేయర్ పదవికి ఎన్నిక నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) జారీ చేసిన నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. దీంతో, మేయర్ ఎన్నిక ప్రక్రియకు ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి.
కడప మేయర్ ఎన్నిక కోసం ఈ నెల 4న ఎస్ఈసీ నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే, తనను మేయర్ పదవి నుంచి తొలగించడంపై వేసిన కేసు హైకోర్టులో పెండింగ్‌లో ఉందని, కడప మున్సిపల్ కార్పొరేషన్ పాలకమండలి గడువు 2026 మార్చి వరకు ఉందని సురేశ్ బాబు తన పిటిషన్‌లో పేర్కొన్నారు. పదవీకాలం ముగియడానికి ఆరు నెలల ముందు ఎన్నికలు నిర్వహించడం పురపాలక చట్ట నిబంధనలకు విరుద్ధమని ఆయన తరఫు న్యాయవాది వాదించారు.ఈ వాదనలను ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది వ్యతిరేకించారు. ఆరు నెలల నిబంధన సభ్యుల ఎన్నికలకు మాత్రమే వర్తిస్తుందని, పరోక్ష పద్ధతిలో జరిగే మేయర్ ఎన్నికకు ఇది వర్తించదని కోర్టుకు వివరించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ఉన్నత న్యాయస్థానం, సురేశ్ బాబు పిటిషన్‌ను తిరస్కరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.ఈ తీర్పుతో, ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే మేయర్ ఎన్నిక జరగనుంది. ఇప్పటికే కడప జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం.. డిసెంబర్ 11న ఉదయం 11 గంటలకు కార్పొరేషన్ కార్యాలయంలో కార్పొరేటర్లు, ఎక్స్-అఫీషియో సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మేయర్‌ను ఎన్నుకోనున్నారు.

## తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనాలపై టీటీడీ కీలక ప్రకటన

**డిసెంబర్, జనవరి నెలల్లోని పర్వదినాల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు**
**సామాన్య భక్తుల సౌకర్యార్థం టీటీడీ కీలక నిర్ణయం**
**వైకుంఠ ఏకాదశి, రథసప్తమి రోజుల్లో అమలుకానున్న ఆంక్షలు**
**ప్రొటోకాల్ ప్రముఖులకు మాత్రమే మినహాయింపు ఉంటుందని వెల్లడి**
**సిఫార్సు లేఖలు స్వీకరించబోమని స్పష్టం చేసిన దేవస్థానం**



తిరుమల శ్రీవారి ఆలయంలో రాబోయే పర్వదినాల సందర్భంగా సామాన్య భక్తులకు ప్రాధాన్యతనిస్తూ తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కీలక నిర్ణయం తీసుకుంది. డిసెంబర్, జనవరి నెలల్లో వచ్చే ముఖ్యమైన ఉత్సవాల రోజుల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, దర్శన ప్రక్రియను సులభతరం చేసేందుకే ఈ చర్యలు తీసుకున్నట్లు స్పష్టం చేసింది.టీటీడీ ప్రకటించిన వివరాల ప్రకారం.. డిసెంబర్ 23న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, డిసెంబర్ 29న వైకుంఠ ఏకాదశికి ముందు రోజు, డిసెంబర్ 30 నుంచి జనవరి 8 వరకు వైకుంఠ ద్వార దర్శనాలు, అలాగే జనవరి 25న రథసప్తమి పర్వదినం సందర్భంగా వీఐపీ బ్రేక్ దర్శనాలు అందుబాటులో ఉండవు. అయితే, ప్రొటోకాల్ పరిధిలోని ప్రముఖులకు మాత్రం మినహాయింపు ఉంటుందని తెలిపింది.ఈ ప్రత్యేక రోజుల్లో బ్రేక్ దర్శనాల కోసం ఎలాంటి సిఫార్సు లేఖలను స్వీకరించబోమని టీటీడీ తేల్చిచెప్పింది. లక్షలాదిగా తరలివచ్చే భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని వీఐపీలు, భక్తులు ఈ మార్పులను గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేసింది. వైకుంఠ ద్వార దర్శనం, రథసప్తమి వంటి పవిత్రమైన రోజుల్లో రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున, ఈ నిర్ణయం సామాన్య భక్తులకు ఎంతో ఊరటనిస్తుందని భావిస్తున్నారు.

# వివేకా హత్య కేసులో సునీత పిటిషన్...

**కీలక ఆదేశాలు ఇచ్చిన సీబీఐ కోర్టు**
**వివేకా హత్య కేసులో కీలక పరిణామం**
**సునీత పిటిషన్‌పై తీర్పు వెల్లడించిన సీబీఐ కోర్టు**
**కేసులో పాక్షిక దర్యాప్తునకు న్యాయస్థానం ఆదేశం**
**ఇద్దరు కీలక వ్యక్తుల ఫోన్ సంభాషణపై విచారణకు ఉత్తర్వులు**
**లోతైన దర్యాప్తుతోనే నిజాలు బయటపడతాయని సునీత వాదన**



మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో బుధవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో పాక్షికంగా తదుపరి దర్యాప్తు జరపాలని హైదరాబాద్‌లోని నాంపల్లి సీబీఐ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. సమగ్ర దర్యాప్తు కోరుతూ వివేకా కుమార్తె వైఎస్ సునీత దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ మేరకు తీర్పు వెలువరించింది.ఈ కేసులో దర్యాప్తును లోతుగా చేయకపోతే అసలు నిందితులు తప్పించుకునే ప్రమాదం ఉందని సునీత తరఫు న్యాయవాదులు కోర్టులో వాదనలు వినిపించారు. సప్లిమెంటరీ చార్జ్‌షీట్ దాఖలు చేసేలా సీబీఐని ఆదేశించాలని కోరారు. అయితే, దర్యాప్తు ఇప్పటికే ముగిసిందని, మళ్లీ విచారణకు అవకాశం లేదని నిందితుల తరఫు న్యాయవాదులు వాదించారు.ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు, నిందితుడు సునీల్ యాదవ్ సోదరుడు కిరణ్ యాదవ్, వైఎస్ భాస్కర్ రెడ్డి సోదరుడి కుమారుడు అర్జున్ రెడ్డి మధ్య జరిగిన ఫోన్ సంభాషణలపై దృష్టి సారించాలని సీబీఐకి సూచించింది. ఆ సంభాషణకు సంబంధించిన వివరాలపై దర్యాప్తు జరపాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. కోర్టు తాజా ఉత్తర్వులతో ఈ కేసులో మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయని సునీత వర్గం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

# చిన్నారి గాయని సాధ్యకు సీఎం చంద్రబాబు ప్రశంస

**22 ప్రదర్శనల్లో 22 అవార్డులు సాధించిన చిన్నారి సాధ్య**
**తల్లిదండ్రులతో కలిసి సీఎం చంద్రబాబును కలిసిన బాల గాయని**
**హార్వర్డ్ వంటి ప్రతిష్ఠాత్మక వేదికలపై సత్తా చాటిన సాధ్య**
**సాధ్య భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని సీఎం ఆకాంక్ష**
**చిన్నారిని ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను అభినందించిన ముఖ్యమంత్రి**





అంతర్జాతీయ వేదికలపై చిన్నతనంలోనే శ్రావ్యంగా పాటలు పాడుతూ పేరు ప్రఖ్యాతలు తెచ్చుకున్న గాయని సాధ్యను సీఎం చంద్రబాబు ప్రశంసించారు. బుధవారం చిన్నారి సాధ్య, ఆమె తల్లిదండ్రులు స్పైరా, సిరి కృష్ణ సీఎం చంద్రబాబును సచివాలయంలో కలిశారు. చిన్నారి గాయని సాధ్య వివిధ దేశాల్లో ప్రదర్శనలు ఇచ్చి ప్రతిష్ఠాత్మక అవార్డులు దక్కించుకుందని ఆమె తల్లిదండ్రులు సీఎంకు వివరించారు. సోలో ప్రదర్శనలలో సాధ్య విజయాలు సాధించిందని.. యార్క్ యూనివర్సిటీ, హార్వర్డ్ యూనివర్సిటీ, శాన్ ఫ్రాన్సిస్కో ఓపెరా హౌస్ వంటి పలు అంతర్జాతీయ వేదికలపై ఆమె ఏడు సార్లు ప్రథమ స్థానం, ఏడు సార్లు ద్వితీయ స్థానం, రెండు సార్లు తృతీయ స్థానాల్లో విజయం సాధించిందని ఆమె తల్లిదండ్రులు సీఎంకు తెలిపారు. వీటితో పాటు మూడు గౌరవప్రదమైన బహుమతులు, మూడు ప్రత్యేక బహుమతులు కూడా సొంతం చేసుకుందని చెప్పారు.
ఇప్పటివరకు మొత్తం 22 ప్రదేశాల్లో 22 ప్రతిష్ఠాత్మక జాతీయ, అంతర్జాతీయ పాటల పోటీల్లో పాల్గొందని... ప్రతిచోటా అవార్డులు సొంతం చేసుకుందని వివరించారు.
అలాగే యూరో ఎలైట్ ఇంటర్నేషనల్ మ్యూజిక్ కాంపిటీషన్, కెనడియన్ ఇంటర్నేషనల్ మ్యూజిక్ కాంపిటీషన్, రాయల్ మాస్ ఇంటర్నేషనల్ మ్యూజిక్ కాంపిటీషన్ వంటి అగ్రశ్రేణి అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని సాధ్య తన ప్రతిభను చాటుకుందని సీఎం దృష్టికి ఆమె తల్లిదండ్రులు తీసుకెళ్లారు. చిన్నారి సాధ్యను సంగీతంలో రాణించేలా ప్రోత్సహిస్తున్న ఆమె తల్లిదండ్రులను సీఎం అభినందించారు.
కాకుమాను మండలం కొండపాటూరుకు చెందిన కాటూరు మెడికల్ కాలేజి, హాస్పటల్ అధినేత మనుమరాలైన సాధ్య మరిన్ని విజయాలు సాధించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

# రాహుల్ కన్నా ప్రియాంక బెటర్



లోక్‌సభలో రెండు రోజుల పాటు రెండు అంశాలపై జరిగిన చర్చల్లో..విపక్ష సభ్యులు మాట్లాడిన తీరును పరిశీలిస్తే.. రాహుల్ తన అపరిపక్వతను మరోమారు బయట పెట్టుకున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ ఎంపి ప్రియాంకా వాద్రా మాత్రం పరిణతి చెందిన రాజకీయ నేతగా రాణించారు. వందేమాతరంపై చర్చలో ప్రియాంక ఓ రకంగా మోడీని అడ్డుకుని తీరారనే చెప్పాలి. నెహ్రూ ద్రోహం గురించి మోడీ మాట్లాడిన సందర్భంలో ఆమె గట్టిగానే ఎదుర్కొన్నారు. ఇవాళ జరుగుతున్న అభివృద్దికి అంతా నెహ్రూ వేసిన పునాది అని గట్టిగా చెప్పగలిగారు. అలాగే వందేమాతరం ప్రస్తావన ద్వారా నెహ్రూను ఎండగట్టాలన్న తీరును కూడా తప్పు పట్టారు. ఒకవేళ నెహ్రూ గురించి అయితే ఓ రోజంతా చర్చిద్దామని, తిరిగి మళ్లీ నెహ్రూ జోలికి వెళ్లవద్దని అన్నారు. అయితే ఆమె మాట్లాడిన తీరు పరిణతి చెందిన రాజకీయ నేతగా కనిపించారు. సమస్యలను లోతుగా ఎత్తిచూపి మాట్లాడే సత్తా ఉన్న నేతగా కనిపించారు. రాహుల్‌తో పోలిస్తే ఆమె చాలా మెరుగైన నాయకత్వ లక్షణాలను కనబర్చారు. రాజకీయంగా మోడీని లేదా బిజెపిని ఎదుర్కొనే విషయంలో ఆమె సందర్భోచితంగా మాట్లాడ కలుగుతున్నారు. ఈ లెక్కన కాంగ్రెస్‌కు ఆమె సరైన నేతగా దారి చూపగల రని భావించవచ్చు. ఎందుకంటే రాహుల్ కేవలం ఓట్ చోరీ అని నిందించడం తప్ప ఆధారాలను సమర్పించే ప్రయత్నం ఇప్పటి వరకు చేయలేదు. బీహార్‌లో ఇదే నినాదంతో పోయి బొక్కబోర్లా పడ్డారు. అయినా ఆయనలో మార్పు కనిపించడం లేదు. ఎందుకంటే పార్లమెంటులో కూడా మళ్లీ ఇదే విధంగా తన పాతపాటనే పాడారు. ఓట్ల తొలగింపు ప్రక్రియ సర్‌ను తప్పుపట్టడమే పెద్ద తప్పు. రాజ్యాంగ వ్యవస్థను పనిచేయకుండా అడ్డుకున్నట్లేనని గురించడ లేదు. ఓట్ల తొలగింపు ద్వారా అర్హులైన ఓటర్లను గుర్తించ కేసు వేయించివుంటే రాహుల్ ప్రతిభ ఇనుమడించేది. సుప్రీం కూడా ఇదే కోరింది. కానీ రాహుల్ అది చేయలేదు. తాజాగా పార్లమెంటులోమంగళవారం సర్ ప్రక్రియపై రాహుల్ మాటలు పేలవంగా ఉన్నాయి. ప్రజలను ఆకట్టుకునేలా ప్రసంగం లేదు. అలాగే తప్పులను ఎత్తిచూపే విధంగానూ లేదు. కేవలం ఆర్‌ఎస్‌ఎస్‌ను దుమ్మెత్తి పోయడం ద్వారా మైనార్టీ ఓటు బ్యాంక్‌ను పదిల పర్చుకునే ఎత్తుగడ ప్రదర్శించారు. ఓటుచోరీ అనేది అతిపెద్ద దేశద్రోహమని, ఎన్నికల సంఘంతో కలిసి భాజపా దానికి పాల్పడుతోందని రాహుల్‌గాంధీ మరోసారి ఆరోపించారు. ఎన్నికల సంస్కరణలపై మంగళవారం లోక్‌సభలో ప్రత్యేక చర్చలో ఆయన తన పాత మాటలనే రికార్డుగా వినిపించారు. దేశ మూలాలనే దెబ్బతీసేలా ఓటుచోరీ జరుగుతోందని, సంస్థాగత వ్యవస్థ మొత్తాన్ని ఆరెస్సెస్ టోకుగా గుప్పిట పట్టిందని చెప్పడం ద్వారా వ్యవస్థను తప్పు పట్టారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా ఎన్నికల సంఘం ఇదే చేసేది. భారత ప్రజాస్వామ్యానికి భంగం కలిగేలా ఎన్నికల సంఘాన్ని భాజపా వాడుకుంటోందని ఆరోపించడం ద్వారా ప్రజలల్లో తనకు ఇమేజ్ లేదని చెప్పుకున్నారు. ఎన్నికలకు నెల ముందు మెషీన్ రీడబుల్ నమూనాలో అన్ని పార్టీలకూ ఓటర్ల జాబితాలు ఇవ్వండని అడగడంలో తప్పు లేదు. కానీ నేతలు నిష్పాక్షికంగా ఉన్నప్పుడే ఎన్నికల సంస్కరణలు సాధ్యమవుతాయని గుర్తించాలి. కాంగ్రెస దేశంలో దశాబ్దాల పాటు పాలన చేసింది. దీనికి ఓట్ చోరీ కారణమని అనుకోవాలా అన్నది రాహుల్ చెప్పాలి. ఎన్నికలవ్యవస్థపై దాడిచేసే బదులు నిర్మాణాత్మక విమర్శలు,సూచనలు చేసివుంటే రాహుల్ ప్రతిభ ఇనుమడించేది. అందుకే ప్రియాంకతో పోలిస్తే రాహుల్‌కు విషయ పరిజ్ఞానం తక్కువని తేలిపోయింది. నిజానికి బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో ప్రజలు ఇచ్చిన తీర్పును పరిశీలిస్తే విపక్షం పట్ల ప్రజల విముఖత ప్రతిబింబించింది. లాలూ కుటుంబంతో పాటు, రాహుల్ తీరుపై అంటే కాంగ్రెస్‌పై ఉన్న వ్యతిరేకత స్పష్టంగా ప్రతిబింబించింది. ఈ ప్రజాతీర్పును ప్రజలంతా అంగీకరించి నా, రాహుల్ మాత్రం అంగీకరించడం లేదు. ఓట్ చోరీ మాయలో పడ్డ ఆయన మొత్తం ఎన్నికల తీరునే తప్పు పట్టారు. సర్ ప్రక్రియను కూడా తప్పు పట్టడం రాజ్యాంగ వ్యవస్థల పనితీరును ప్రశ్నించడం తప్ప మరోటి కాదు. రాహుల్ పరిణతి రాజకీయాలు అవలంబించాలి. రాహుల్‌గాంధీ ఎంతకూ ఓట్ చోరీ, నిరుద్యోగిత అంశాలకే పరిమితమయ్యారు. అంతే తప్ప సమస్యలు లేదా ప్రజలు నిరంతరం ఎదుర్కొం టున్న ప్రధాన విషయాలను ప్రస్తావించడం లో రాహుల్ విఫలం అయ్యారు. పార్లమెంటులో అనేక సమస్యలను ప్రస్తావించి చర్చించడంలో విపక్షనేతగా విఫలం అయ్యారు. విపక్షాల పట్ల ప్రజల్లో ఒక ప్రగాఢ ఆకాంక్షను నెలకొల్పడంలోనూ ప్రతిపక్ష రాజకీయ పార్టీలు విఫలమయ్యాయి. బిహార్‌లో మాత్రమే ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాన్ని చేపట్టింది. ఇప్పుడు బెంగాల్ సహా అనేక రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ మొదలయ్యింది. బెంగాల్లో మమతా బెనర్జీ కూడా మొత్తం పక్రియనే వ్యతిరేకిస్తోంది. ఇది ఎంతవరకు సబబో ఆలోచించాలి. ప్రజలు ఏం సమస్యలు ఎదుర్కొంటున్నారో..పార్లమెంట్ వేదికగా వాటికి ఎలాంటి పరిష్కారం చూపాలో అన్నది వపక్ష పార్టీల బాధ్యత. కేవలం ఓట్ చోరీ నినాదాలతో ముందుకు నడవలేరు. పార్లమెంటు లో ఆయా అంశాలపై చర్చ జరక్క పోవడానికి కారణం ఇదే. అందుకు విపక్ష పార్టీలదే బాధ్యత. కాంగ్రెస్‌కు సంబంధించినంత వరకు ప్రియాంకను విపక్ష నేతగా చేస్తే మంచిది. ఆమెను మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలి. అప్పుడు ఆమె రాటుదేలుతుందనడంలో ఎలాంటి అనుమానాలు అక్కర్లేదు.

# 'మీ డబ్బు.. మీ హక్కు'
# అన్‌క్లెయిమ్డ్ మనీ సొంతం చేసుకోండి

## ప్రధాని మోడీ మరోమారు పిలుపు

**న్యూఢిల్లీ,డిసెంబర్10**

అన్ క్లెయిమ్డ్ ఆస్తు విషయంలో ఆర్‌బిఐ ఇటీవలే మార్గదర్శకాలను జారీ చేసింది. దీంతో ప్రజల్లో కొంత చైతన్యం వచ్చింది. ఇప్పుడు ప్రధాని మోడీ కూడా తనవంతుగా ప్రచారం మొదలు పెట్టారు. ఇది ప్రజలకు మేలు చేస్తుందన్న భావనలో ఆయన ప్రకటన చేశారు. క్లెయిమ్ చేయని ఆస్తుల గురించి ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం 'లింక్డిన్' ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. మరిచిపోయిన, క్లెయిమ్ చేయని నగదును దక్కించుకునేందుకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు అందుకోసం 'మీ డబ్బు.. మీ హక్కు' మూమెంట్‌లో పాల్గొనాలని సూచించారు. భారతీయ బ్యాంకుల్లో రూ.78 వేల కోట్లు, ఇన్సూరెన్స్ కంపెనీల్లో రూ.14 వేల కోట్లు, మ్యూచువల్ ఫండ్ కంపెనీల్లో రూ.3వేల కోట్లు, డివిడెండ్లు రూ.9వేల కోట్లు క్లెయిమ్ చేయకుండా ఉన్నాయని చెప్పారు. ఇటువంటి ఆస్తుల గురించి తెలుసుకునేందుకు సంబంధిత వెబ్‌సైట్లను ఆయన పంచుకున్నారు. ప్రతి పౌరుడు తనకు చెందిన సొమ్మును తిరిగి పొందేందుకే ఈ మూమెంట్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. మర్చిపోయిన ఆస్తులను కొత్త అవకాశంగా మార్చుకోండి. ఈ మూమెంట్‌లో భాగం కండి. ఈ ఆస్తుల వివరాలు ప్రజలను ఆశ్చర్యపరుస్తున్నాయి. ఏదిఏమైనప్పటికీ.. ఇవన్నీ ఎన్నో కుటుంబాలు కష్టపడి కూడబెట్టిన పొదుపు, పెట్టుబడులను సూచిస్తున్నాయని ప్రధాని తన పోస్టులో రాసుకొచ్చారు. ఇప్పటికే రూ.2వేల కోట్ల విలువైన ఆర్థిక ఆస్తులను ఈ ఏడాది అక్టోబరు, నవంబరుల్లో అర్హులైన హక్కుదార్లకు అందించామని చెప్పారు. అనేక కారణాల వల్ల క్లెయిమ్ చేసుకోకుండా ఉన్న బ్యాంకు డిపాజిట్లు, బీమా, డివిడెండ్లు, షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, పింఛన్ లాంటి ఆర్థిక ఆస్తులను సంబంధిత హక్కుదారులకు, చట్టబద్ధ వారసులకు అందించాలన్న లక్ష్యంతో 'యువర్ మనీ, యువర్ రైట్' కార్యక్రమాన్ని అక్టోబరు 4న దేశవ్యాప్తంగా ప్రభుత్వం ప్రారంభించింది. ఇందులోభాగంగా ప్రజాప్రతినిధులు, జిల్లా పాలనా అధికారులు, ఆర్థిక సేవల అధికారులతో అక్టోబరు నుంచి డిసెంబరు 5 వరకు 477 జిల్లాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేసి.. ప్రజలకు అవగాహన కల్పించినట్లు రాజ్యసభలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరీ ఇప్పటికే వెల్లడించారు. ఆర్థిక సంస్థల్లో ఉండిపోయిన తమ ఆర్థిక ఆస్తులను పొందేందుకు అనుసరించాల్సిన విధివిధానాలను తెలిపి, సందేహాలను పరిష్కరించడంతో పాటు పలు అంశాలపై అవగాహన కల్పించే విషయాలను ప్రధాన ప్రాంతీయభాషల్లోనే అందించామని వెల్లడించారు. తక్కువ సమయం నిడివితో వీడియో సందేశాల ద్వారా విస్తృతంగా ప్రచారం కల్పించామని మంత్రి తెలిపారు. ఆర్‌బీఐ, సెబీ, ఐఆర్‌డీఏఐ, పీఎఫ్‌ఆర్‌డీఏ, ఐఈపీఎఫ్‌ఏ లాంటి ఆర్థిక రంగ నియంత్రణ సంస్థలు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నాయని వివరించారు. ప్రజలు తమ అన్÷–లకెయిమ్డ్ ఆర్థిక ఆస్తులను కనుగొనడంలో ఆర్‌బీఐ 'ఉద్గమ్', ఐఆర్‌డీఏఐ 'బీమా భరోసా', సెబీ 'మిత్రా' సమర్థంగా ఉపయోగపడుతున్నాయని మంత్రి తెలిపారు.




# వెండి బంగారమవుతోంది

## బంగారంతో పోటీ పడుతున్న ధరలు

## సామాన్యులకు చుక్కలు చూపుతున్న రేట్లు

**న్యూఢిల్లీ,డిసెంబర్10**

నిన్నమొన్నటి వరకు పసిడి గురించి బెంగెట్టుకున్న వారంతా ఇపపుడు వెండిపైనా బెంగపడుతున్నారు. బంగారం లాగే వెండి కూడా బంగారమయ్యింది. వెండి ధరల గురించి చర్చించుకుంటున్నారు. బంగారంతో పాటు ఇన్నాళ్లు పెరిగిన వెండి.. ఇప్పుడు పసిడిని దాటేసి పరుగులు పెడుతోంది. తాజాగా అంతర్జాతీయ మార్కెట్‌లో మునుపెన్నడూ లేని విధంగా ఔన్సు 60 డాలర్లు దాటేసింది. దీన్ని అనుసరించి దేశీయంగానూ వెండి ధర భారీగా పెరిగింది. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో బుధవారం రూ.1.92 లక్షలు పలుకుతోంది. సరిగ్గా ఏడాదిక్రితం తొలిసారి రూ.లక్ష మార్కును దాటిన వెండి.. ఇప్పుడు రూ.2 లక్షల మార్కు దిశగా దూసుకెళుతోంది. అంతర్జాతీయ విపణిలో గత కొన్ని రోజులుగా 50 డాలర్లు పైన ట్రేడయిన వెండి ఒక్కసారిగా దాదాపు 5 శాతం మేర పెరిగింది. అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న అంచనాలు, సరఫరాలో అంతరాలు దీనికి కారణమని అనలిస్టులు పేర్కొంటు న్నారు. ఫెడ్ వడ్డీ రేట్లను పావు శాతం మేర తగ్గిస్తుందన్న అంచనాలు ఈసారి బలంగా ఉన్నాయి. రేట్ల కోత చేపట్టినప్పుడు సాధారణంగా బంగారం, వెండి వంటి లోహాలకు డిమాండ్ పెరుగుతుంది. వడ్డీ రేట్ల కోత ప్రకటించాక వీటి రేట్లు మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఒకప్పుడు కేవలం ఇంట్లో వస్తువులు, ఆభరణాలకు మాత్రమే వెండిని వినియోగించేవారు. కానీ, పారిశ్రామికంగానూ వెండి అవసరం

పెరుగుతుండడంతో దీనికి డిమాండ్ ఏర్పడింది. ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్, సోలార్ ప్యానెల్స్, ఈవీ కాంపోనెంట్స్‌లో దీని వినియోగం పెరిగింది. అవసరాలకు అనుగుణంగా వెండి ఉత్పత్తి పెరగకపోవడంతో ఈ లోహానికి డిమాండ్ ఏర్పడింది. ఈ క్రమంలోనే గతంలో బంగారం ధర 59 శాతం మేర పెరగ్గా.. వెండి ధర ఏకంగా 107 శాతం మేర పైకెగిసింది. ఇక హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి కిలో వెండి రూ.1.92 లక్షల వద్ద ఉంది. 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1.32 లక్షలు పలుకుతుండగా.. ఆర్నమెంట్‌కు వినియోగించే 22 క్యారెట్ల పసిడి ధర రూ.1.20 లక్షల వద్ద ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ఔన్సు 4,207 డాలర్ల వద్ద ట్రేడవుతోండగా.. వెండి ఔన్సు 61.49 డాలర్లు వద్ద కొనసాగుతోంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో వెండి, బంగారానికి డిమాండ్ కొనసాగుతోంది. వెండి రికార్డు గరిష్టాలకు చేరుకుంది. బుధవారం వెండి కిలోకు ఏకంగా 9000 రూపాయలు పెరిగింది. హైదరాబాద్‌లో కిలో వెండి ఏకంగా రూ. 2, 07, 000కు చేరుకుంది. అనుకున్నట్టుగానే రెండు లక్షలు దాటేసింది. 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ. 1, 30, 310కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 1, 19, 450కి చేరింది. ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 30, 460కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 1, 19, 600కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 30, 310కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 1, 19, 450కి చేరింది. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; Mahesh Babu
RNI No: APTEL/2012/46499Phone No 9849499960,9059696959 Email id: Pallevelugu@gmail.com